
J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 33 19.01.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# జై శ్రీరామ్

**జనవరి 22...** భారతదేశంలో మహోన్నతమైన ఉజ్వలఘట్టం అవిష్కృతమయ్యే రోజు. భారతీయుల శతాబ్దాలనాటి కల... ఫలించే రోజు. దేశవ్యాప్తంగా 'జై శ్రీరామ్' అంటూ రామనామం మారుమ్రోగే రోజు. ప్రతి ఇంటా రామజ్యోతులు వెలిగే దివ్యమైన రోజు. అయోధ్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజమంతా రామభక్తితో పరవశించే రోజు. ప్రత్యేకించి రామభక్తుల గుండెలు పులకించే రోజు. కనీవినీ ఎరుగనివిధంగా అయోధ్యలోని రామాలయం గర్భగుడిలో బాలరాముడి విగ్రహానికి అత్యంత వైభవంగా ప్రాణప్రతిష్ట జరిగే ఆ శుభ ఘడియలకు ముహూర్తం సమీపిస్తుండడంతో దేశప్రజలు ఆనందసందోహంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రుడే తిరిగి అవతరిస్తున్నాడన్న సంబరం భక్తజనంలో పరవళ్లుతొక్కుతోంది. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట ప్రధానకర్త.. ప్రధాని మోడీ సారధ్యంలో, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నేతృత్వంలో జనవరి 22వ తేదీ మధ్యాహ్నం జరిగే ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకించి తరించేందుకు కోట్లాదిమంది ప్రజలు ఉవ్విళ్ళూరుతున్నారు. 10లో

## ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా

# సవాళ్ళ నడుమ షర్మిల

10లో



- 21న బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళ
- తెలంగాణలో ఆమె ఫెయిలా.. పాసా..?
- అలాంటి పోరాటాలే ఇక్కడా చేస్తారా??

## దేవుళ్ళు.. రాజకీయాలు!

సత్యపీఠం.. 4 లో

## 'అయ్యో రామా'లయం

మనలో మాట.. 9 లో



### శ్రీ రంగనాథాలయంలో
# వేడుకగా.. గోదా కల్యాణం



ధనుర్మాస వ్రతం పూర్తయిన సందర్భంగా ఈనెల 14న నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయకులస్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు తొలుత స్వామివారికి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు చేసి ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవాలు చేశారు. అనంతరం మంగళవాద్యాలు– వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకకు శ్రీకృష్ణచరిత మానస ప్రచారమండలి ప్రతినిధులు కొండేటి పెంచలయ్య– లలితాకుమారి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు గోపి, రాజేంద్ర, వేలూరు శ్రీనివాసులు, బల్లవోలు రమణయ్య, వీరేపల్లి పద్మజ, దొరస్వామి తదితరులు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

# బీద రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పుట్టినరోజు వేడుకలను ఇటీవల మండల కేంద్రమైన అల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో పార్టీ వర్గాల వారు ఘనంగా నిర్వహించారు. పెద్ద కేకును కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో రవిచంద్ర అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 110 మంది రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. అల్లూరు మండల టీడీపీ అధ్యక్షులు బండి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, రామిశెట్టి కృష్ణచైతన్య, రాజశేఖర్‌బాబు, రమణయ్య, రాజేంద్ర, తిరుమల, రుద్రయ్య, వేగూరు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తిరివీధి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



### వాత్సల్యకు
# రూ.లక్షా 8 వేల విరాళం

నెల్లూరు కొండాయపాళెంలోని నిరాధార బాలల శరణాలయానికి స్థానిక ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ టి. కోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.లక్ష్మి ఈనెల 13న వారి పుట్టినరోజు సందర్భంగా వాత్సల్యను సందర్శించి లక్షా 8వేల రూపాయలను విరాళంగా అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో వాత్సల్య కార్యదర్శి జివి సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు వాత్సల్య సంస్థ తరపున నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

### డీపీఆర్ఓగా
# రమేష్‌కి ఉద్యోగోన్నతి



జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో పలు విభాగాల్లో పనిచేస్తూ డివిజనల్ పీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న రమేష్ ఆ శాఖ జిల్లా అధికారి (డీపీఆర్ఓ)గా పదోన్నతి పొందారు. ఆయన్ను ప్రకాశం జిల్లాలో డీపీఆర్ఓగా నియమిస్తూ సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌ను డెప్యూటీ డైరెక్టర్ సదారావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

# డా. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు.. తరలిరండి
### - ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ విక్టర్‌ప్రసాద్ పిలుపు



విజయవాడలో ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా జరగనున్న 125 అడుగుల డా.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని డా. అంబేద్కర్ భవన్‌లో ఈనెల 14న ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా దాదాపు 4వందల కోట్ల రూపాయల వ్యయంతో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం నెలకొల్పడం చరిత్రాత్మకమని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ మహాశయుని విగ్రహాన్ని, స్మృతి వనాన్ని విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నెలకొల్పడం అద్భుతమని కొనియాడారు. డా అంబేద్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పండుగ వాతావరణంలో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. తొలుత ఆయన డా.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి రమేష్‌బాబు, పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై అప్రజాస్వామిక విధానాలు అమలుచేస్తోందంటూ నెల్లూరులోని యుటిఎఫ్ నాయకులు ఈనెల 14న ఆందోళన నిర్వహించారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయం ఎదుట భోగిమంటల్లో ప్లకార్డులు దగ్ధం చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేయకుండా, ఉపాధ్యాయులు చేస్తున్న ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చలపతిశర్మ, నాయకులు అచ్చయ్య, మధుసూదన్‌రావు, మురళీధర్‌రావు, శీనయ్య, రియాజ్, సుబ్రహ్మణ్యం, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నగరంలోని ముత్తుకూరురోడ్డు సెంటర్‌లో భోగిమంటలు వేసి జీఓ ప్రతులను దహనం చేశారు. సీఐటియు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, సుధాకర్, సంపూర్ణమ్మ, రాజా, మురళి తదితరులు పాల్గొన్నారు.

# కోలాహలంగా ఎడ్ల పందాలు



భోగి పండుగ సందర్భంగా 14వతేదీన కోవూరులో పెద్దఎత్తున ఎడ్ల బండ్ల పరుగు పందాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో కోవూరు మండలానికి చెందిన చెన్నకేశవుల ఎడ్ల జట్టు ప్రథమస్థానం సాధించింది. చాముండేశ్వరి సీ ఫుడ్స్– గంగపట్నం జట్టు రెండో బహుమతిని, పాటూరులోని శ్రీ ఆంజనేయ ఎడ్ల జట్టు మూడో బహుమతిని, బాపట్ల జిల్లా కంకటపాలెంకు చెందిన అభయాంజనేయస్వామి ఎడ్ల జట్టు నాల్గో బహుమతిని, కోవూరుకు చెందిన వీరాంజనేయస్వామి ఎడ్ల జట్టు అయిదవ బహుమతిని సాధించాయి. ప్రథమ బహుమతి పొందిన మద్దెల కిరణ్‌కు చెందిన చెన్నకేశవ ఎడ్ల జట్టును అందరూ అభినందించారు. దాత నారపరెడ్డి సోమశేఖర్‌రెడ్డి వారి తండ్రి శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం రూ.15,116 లతో పాటు, వెండికప్పును ప్రథమస్థానం సాధించిన జట్టుకు అందజేశారు. అదేవిధంగా, రెండో బహుమతి సాధించిన చాముండేశ్వరి సీ ఫుడ్స్–గంగపట్నం జట్టుకు దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుబ్బమ్మ, కుమారులు రూ.13,116 అందజేయగా, మూడో బహుమతి పొందిన పాటూరు గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయం ఎడ్ల జట్టుకు కోవూరు నివాసి గాదిరాజు భాస్కర్ రావు, జీవనకృష్ణలు రూ.10,116లు బహుమతిగా ఇచ్చారు. బాపట్ల జిల్లాకు చెందిన అభయాంజనేయస్వామి ఎడ్లజట్టు నాల్గవ స్థానం సాధించగా, కోవూరుకు చెందిన శిగినం ఆదిశేషయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆదినారాయణ, వెండి కప్పును సాయం వరదయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయికుమార్ అందించారు. 5వ బహుమతి పొందిన కోవూరు వీరాంజనేయ ఎడ్ల జట్టుకు గడ్డం చిన వెంగళరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేణు నగదు బహుమతిని, వెండికప్పును కైలాసం పద్మావతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త గోపాలరెడ్డి అందజేశారు. కోవూరు ఎడ్ల బద్ద సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మెన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వేమారెడ్డి వినీత్ రెడ్డి, సమన్వయకర్తలు పి.మల్లికార్జున రెడ్డి, నరేంద్రరెడ్డి, తాటిపర్తి విజయకుమార్ రెడ్డి, ఎం.రమణారెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, బాబు పర్యవేక్షించారు.




### శ్రీసిటీలోని వెంచర్ పరిశ్రమ
# సీఇఓకు ప్రతిష్టాత్మక అవార్డు

శ్రీసిటీలోని 'వెంచర్' ఆటోమోటివ్ కూలింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ సీఇఓ శరవణన్ జానకిరామన్‌ను ప్రతిష్టాత్మక యురేషియన్ బిజినెస్ సమ్మిట్ ఇంటర్నేషనల్ అచీవర్ అవార్డు వరించింది. ఇటీవల లండన్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో జరిగిన యురేషియన్ బిజినెస్ సమ్మిట్‌లో శరవణన్‌కు ఆ అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ ఇంజనీరింగ్, నూతన ఆవిష్కరణల ప్రతిభకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంటు సభ్యుడు వీరేంద్రశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని, శరవణన్‌కు అంతర్జాతీయ అచీవర్ అవార్డును అందజేశారు. ప్రతిష్టాత్మకమైన అవార్డును సాధించినందుకు ఆయన్ను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

### శ్రీసిటీని సందర్శించిన అడిషనల్ డీజీపీ

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మెన్ అతుల్‌సింగ్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. ఆయన సతీమణి, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ మరియు ఇంటీరియర్ డిజైనర్ శ్రీమతి ప్రియాసింగ్ కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. వారికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు.

# గూడూరు వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా మేరిగ మురళి

## అప్పుడు వద్దన్న వారే... ఇప్పుడు ముద్దంటున్నారు!



అదృష్టం ఎవరినైనా వరించాలని నిర్ణయించుకుంటే ఇంక దానిని ఆపడం ఎవరి తరమూ కాదు. ప్రస్తుతం ఆ అదృష్టం శాసనమండలి సభ్యులు మేరిగ మురళి చుట్టూ తిరుగుతోంది.

శాసనమండలి సభ్యుడిగా ఆ అనుభవాలను, ఆ అనుభూతులను ఇంకా పూర్తిగా ఆస్వాదించకముందే అసెంబ్లీ ఆయనకి స్వాగతం చెప్పబోతోంది. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో గూడూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా మేరిగ మురళి బరిలో దిగబోతున్నారు. ఆయనని గూడూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతోనే ఆయనే అభ్యర్థి అన్న సంకేతాలని పార్టీ అధిష్టానం ఇచ్చేసింది.

నిజానికి 2019లోనే ఈ అదృష్టం మురళిని వరించాల్సింది. అప్పట్లో కొన్ని దుష్టశక్తులు చేసిన దుష్ప్రచారం, చెప్పుడు మాటలతో తప్పుదారి పట్టిన పార్టీ సలహాదారుల అసంబద్ధ నిర్ణయం వల్ల మేరిగకి అన్యాయం జరిగింది.

ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలలకే అక్కడ గెలిచిన పెద్దాయన నిజస్వరూపం తెలుసుకున్న పార్టీ పెద్దలు ఖంగుతిన్నారు. అన్యాయంగా మురళిని పక్కనపెట్టి మట్టిని నెత్తిన పెట్టుకున్నామే అని బాధపడ్డారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా మురళిని నియమించారు. అయితే, రాష్ట్ర విభజన సందర్భంగా ఆ విభాగానికి సంబంధించి కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉండడంతో ఆ పదవి మురళికి అలంకారప్రాయమే అయ్యింది. 'అంతా మన మంచికే' అని పెద్దలు చెప్పినట్లుగా, మురళికి అన్యాయం చేశామన్న ఆలోచనలో ఉన్న పార్టీ పెద్దలు ఆయనని ఎం.ఎల్.సి పదవితో గౌరవించారు. అంతలోనే అదృష్టం మళ్ళీ ఆయన తలుపుతట్టింది. నువ్వు ఉండవలసింది అక్కడ కాదు... ఇక్కడా... అంటూ అసెంబ్లీని చూపిస్తోంది.

2019లో మురళి మాకొద్దని గూడూరు ప్రజల చేత చెప్పించిన స్థానిక నాయకులే, అదే ప్రజల చేత మాకు మురళియే కావాలని చెప్పిస్తున్నారు. అప్పుడు తాము వద్దన్న మురళియే మాకిప్పుడు ముద్దని ప్రజలే స్వాగతించేలా చేశారు. మొత్తానికి ఎం.ఎల్.ఎ కావాలనుకున్న మేరిగ మురళి కోరిక నెరవేరబోతోందని గూడూరు వాసులు అంటున్నారు. జాగ్రత్తగా ఎలక్షన్ చేసుకుంటే ఆయనని తిరుగులేని మెజారిటీతో గెలుపు వరిస్తుందని దీవిస్తున్నారు. ఆల్ ది బెస్ట్ టు మురళి!

## ఫిబ్రవరి నుంచి జేవీవీ కళాజాతాలు

రానున్న ఫిబ్రవరి నెల మొదటి వారం నుంచి జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కళాజాతాలు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కాలేషా బాషా చెప్పారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని డా. జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో 'జేవీవీ విజ్ఞాన గీతాల' సీడీని ఆవిష్కరించారు. విజయకుమార్, చలపతిశర్మ, ఉదయభాస్కర్, కృష్ణారెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

# డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మెన్‌గా చిల్లకూరు సుధీర్‌రెడ్డి

## కక్షతో జిల్లా పదవి నుండి తొలగిస్తే... కృషితో రాష్ట్ర అధ్యక్ష స్థానాన్నే సాధించారు



రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మెన్‌గా, విజయా డెయిరీ మాజీ ఛైర్మెన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి నియమింపబడ్డారు. కొత్త సంవత్సర కానుకగా ఆయనని ఈ పదవి వరించింది. సుధీర్‌రెడ్డిని రాష్ట్ర ఛైర్మెన్‌గా నియమిస్తూ జనవరి 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవి ఇంచుమించుగా క్యాబినెట్ హోదాతో సమానం.

చిల్లకూరు సుధీర్‌రెడ్డి అంటే జిల్లా రాజకీయవర్గాల్లో తెలియనివారుండరు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకి ఆ పేరు చిరపరిచితం. గడచిన మూడున్నర దశాబ్దాల కాలంగా దివంగత మహానేత రాజశేఖరరెడ్డి అభిమానిగా ఆయన బాటలో నడిచేవారు సుధీర్‌రెడ్డి. సుమారు పాతికేళ్ళకిపైగా తెలుగుదేశం కబ్జాలో ఉండిన నెల్లూరులోని విజయా డెయిరీలో జరుగుతున్న అవకతవకలపై అనేక పర్యాయాలు పోరాటాలు చేశారు. వారి కబంధహస్తాలనుండి విజయ డెయిరీని విడిపించి 2009లో కాంగ్రెస్ పాలనలో సుధీర్‌రెడ్డి ఆ సంస్థ ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టారు. తన పరిపాలనా కాలంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారు. తొలి ఏడాదిలోనే డెయిరీని లాభాల బాట నడిపించారు. రాజశేఖరరెడ్డి దుర్మరణం పాలవడంతో ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డికి సుధీర్‌రెడ్డి సంఘీభావాన్ని తెలిపారు. జిల్లాలో జగన్ చేపట్టిన ఓదార్పుయాత్రలో పాలు పంచుకున్నారు. అంతే... అటు తెలుగు తమ్ముళ్ళు, ఇటు కాంగ్రెస్ నాయకులూ కలసి సుధీర్‌రెడ్డిని పదవి నుండి దించేశారు. 'అన్నా మనకి మంచి రోజులొస్తాయి, దిగులు పడవద్దు' అని జగన్ చెప్పిన మాట ఇప్పుడు నిజమయ్యింది. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో అదే డెయిరీ రాష్ట్ర ఛైర్మెన్ పదవి సుధీర్‌రెడ్డిని వరించింది.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కాకాణికి సుధీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనకున్న పరిజ్ఞానంతో రాష్ట్రంలో పాడి పరిశ్రమ పురోభివృద్ధికి పాటుపడతానని అన్నారు. రాష్ట్రంలోని అన్ని డెయిరీ సంస్థలను లాభాల బాట పట్టించడానికి తన శక్తిమేరకు కృషిచేసి జగన్‌మోహన్‌రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తానని చెప్పారు. జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి వెళ్లిన సుధీర్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.




# ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న నకిలీ మందులు

అనారోగ్యం ముంచుకొచ్చి, ఏదైనా మందో మాత్రో వేసుకుందా మనుకుంటే ఒక్కోసారి ఆ మందులే ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రాణం పోయాల్సిన మందులు చివరికి ప్రాణాలకే ముప్పు తెచ్చేవిధంగా తయారవుతున్నాయి. కంచే చేను మేసే విధంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా నకిలీ మందులు వీరంగం చేస్తున్నాయని, అత్యధికశాతం మంది ప్రజలు, ముఖ్యంగా అభం శుభం తెలియని అమాయకులు వీటికి బలవుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తెలిసో తెలియకో ఆ నకిలీ మందులు వేసుకుంటే ఉన్న జబ్బు నయమయ్యే సంగతటుంచి, కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయిందన్న సామెతలా తయారవుతోంది పరిస్థితి. ఇలాంటి మాయదారి మందుల విజృంభణ ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉందని, తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పుడో హెచ్చరించింది కూడా. అయినా ఎవరు పట్టించుకుంటున్నారు కనుక!.. అందులోనూ మనదేశంలో అనుమతులు లేని మందులు, లేదా నిషేధించిన స్థిర మోతాదు మిశ్రమం (ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్-ఎఫ్‌డీసి)తో కూడిన యాంటిబయోటిక్స్ అమ్మకాలు కొల్లలుగా ఉంటున్నాయని నిపుణుల నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి. ఆరోగ్యాన్ని గుల్ల చేసే అలాంటి మందులను కూడా ఏదో ఒక విధంగా వాడకంలోకి తెచ్చి వ్యాపారం చేసుకోవడంలో సిద్ధహస్తులెందరో ఉన్నారని దీనివల్ల తేటతెల్లమవుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగాపెట్టి నిజమైన మందులు లాగానే.. నకిలీ మందులు తయారుచేసే కంపెనీలు, అక్రమార్జనే ధ్యేయంగా కల్తీ మందులతో ప్రజల ప్రాణాల్ని తీస్తున్న పైశాచిక వ్యాపారులు కొల్లలుగా పుట్టుకొస్తున్న నేటి సమాజంలో, ఇలాంటి అక్రమాలను అదుపుచేసే నాథులు కనిపించడం లేదు. దేశంలో అక్కడక్కడా అప్పుడప్పుడూ అధికారుల తనిఖీల్లో నకిలీమందులు భారీస్థాయిలో పట్టుబడుతున్నా, అవి ఎక్కడినుంచి తయారవుతున్నాయో గుర్తించేవారు కానీ, ఆయా కంపెనీలపై గట్టి చర్యలు తీసుకునేవారు కానీ లేరు. ఔషధ నియంత్రణ విభాగాలు డొల్లగానే ఉండడం, ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న అక్రమార్కుల ఆట కట్టించేందుకు అవసరమైనంతమంది డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు లేకపోవడం ఒక పెద్ద లోపం. ఇవన్నీ కలసి వెరసి.. ప్రజారోగ్యానికి పెనుశాపంగా పరిణమిస్తున్నా, అటు ప్రభుత్వాలు కానీ, ఇటు పాలకులు కానీ పట్టించుకోకపోవడంతో ఏఏటికాఏడాది నకిలీ మందులు, లేదా నాసిరకం మందులు గతంలో కంటే ఎక్కువగా జనంలోకి కుప్పలు తెప్పలుగా వస్తూనే ఉన్నాయనేది నిపుణుల ఆందోళన. పెద్దపెద్ద నగరాల్లో సైతం నిత్యం అమ్ముతున్న మందుల్లో దాదాపు 20 శాతం మందులు నకిలీవిగానే ఉంటున్నాయనేది కూడా గతంలో జరిగిన నిపుణుల పరిశీలనల్లో తేలింది. ఏళ్ళ తరబడిగా నకిలీ మందులపై నియంత్రణ లేకపోవడంతో ఈ కల్తీ సామ్రాజ్యాలు ఇక ఎవరూ ఏమీచేయలేనంత, ఎవరికీ అందనంత ఎత్తుకి ఎదిగిపోతున్నాయి. అయినా, నానా రకాల రోగాలతో, వ్యాధుల బాధలతో కుమిలిపోతూ డస్సిపోయి మంచంలో పడిపోయివున్న రోగులు పొరపాటునో గ్రహపాటునో ఆ నకిలీమందులు మింగితే ఎంత ప్రమాదమో ఊహించండి. ఏ గుండెజబ్బుతోనో, బీపీతోనో క్యాన్సర్‌తోనో అల్లాడే వారు గబుక్కున ఇలాంటి మందులు వేసుకుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఆలోచించండి. మందులు ప్రాణాలు పోయాలే కానీ.. తీస్తే ఎలా?.. ఇదేనా మన సంస్కృతి?.. కేవలం డబ్బు కోసం, ధనాశతో ఇతరుల ప్రాణాలతో, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడడం ఎంత ఘోరం. ఇకనైనా ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి. ఈ నకిలీల భరతం పట్టాలి. అవసరమైతే చట్టాలకు మరింత పదునుపెట్టాలి. ఔషధ నియంత్రణ కట్టుదిట్టంగా ఉండేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఏఏ జబ్బులకు ఏ మోతాదులో ఉండే ఏఏ మందులు వేసుకోవాలో వైద్యాధికార యంత్రాంగం ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలి. మందుల నాణ్యతను నిర్ధారించడానికి అవసరమైన యంత్రపరికరాలను, పరీక్ష శాలలను ఏర్పాటుచేసి, వినియోగంలోకి వస్తున్న మందులను ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పరిశీలించేందుకు తనిఖీ అధికారుల సంఖ్యను బాగా పెంచాలి. అంతేకాక, అసలు ఈ నకిలీ మందులు ఎక్కడినుంచి పుట్టుకొస్తున్నాయో, వాటి వెనుక ఎవరెవరున్నారో నిఘాబృందాలు కనిపెట్టాలి. వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రజారోగ్యాన్ని నిర్దయగా కాటువేసే ఈ కల్తీమందుల కాలనాగులను కట్టడిచేయడం.. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఎంతైనా అవసరం!..

లాయర్ జనవరి 19, 2024

# దేవుళ్లు.. రాజకీయాలు!

అదేం ఖర్మో తెలియదు కానీ, మనదేశంలో రాజకీయం లేని చోటు అంగుళమైనా కనిపించడం లేదు. చివరికి దేవాలయాలను కూడా ఆ దిక్కుమాలిన రాజకీయాలే శాసిస్తున్నాయి. భక్తులు, ఆధ్యాత్మికవేత్తలకు నిలయాలుగా ఉండాల్సిన దేవాలయాలు రాజకీయ నాయకుల పాలబడుతున్నాయి. దేవాలయాల ఆలనా పాలనా చూసే పాలకమండళ్లలోనూ రాజకీయనాయకులదే అగ్రాసనం. చివరికి దేవాలయాల్లో అటు దేవుళ్లకు, ఇటు భక్తులకు పెట్టే ప్రసాదాల మీద కూడా వాళ్లదే పెత్తనమైపోతోంది. దర్శనం టిక్కెట్లు కావాలన్నా, ప్రసాదాలు కావాలన్నా ఏదైనా సరే రాజకీయనాయకుల సిఫార్సులుంటే చాలు. డబ్బు, పలుకుబడి ఉంటే ఏ దేవాలయంలోనైనా దర్శనాలకు లోటుండదు. సామాన్యభక్తులకు మాత్రం క్యూలల్లో పడిగాపులు తప్పవు. భక్తులకు-దేవుడికి మధ్య ఈ రాజకీయాలేమిటో ఆ దేవుడికే తెలియాలి. పెద్దపెద్ద దేవాలయాల్లోనే కాదు, చిన్నచిన్న గుళ్లలో కూడా ఈ రకమైన సంస్కృతి ప్రబలిపోతోంది. వాస్తవానికి ఆ ఆలయాభివృద్ధికి సహకరించే పెద్దలను ఆలయం తరపున గౌరవించుకోవాల్సిన సందర్భాలుంటాయి. అలాంటి వాటిని ఎవరూ కాదనరు. అవి అవసరం కూడా. కానీ, ఏ చోటారాజకీయనాయకుడు వచ్చినా, భక్తులందరినీ అలాగే క్యూలల్లో నిలబెట్టేసి, గుళ్లో దేవుడిని కూడా వదిలేసి పూజారులతో సహా పరుగెత్తుకువెళ్లి ఆహ్వానిస్తుండడమే విచారకరం. కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలోనైతే..వీఐపీలు వస్తే చాలు..సామాన్యులకు దైవదర్శనం కోసం గంటల తరబడి క్యూలలో పడిగాపులు కాయాల్సిందేనని భక్తులు గగ్గోలు పెడుతూనే ఉంటారు. కానీ, పట్టించుకునేదెవరు?.. అలాంటి గొప్ప దేవాలయాల్లో పాలకమండలి సభ్యులు కావాలంటే తమాషా కాదు. కోట్లు చేతిలో ఉంటే తప్ప కుదరదని అంటుంటారు. అయినా దేవుడి వద్ద కూడా ఇంత రాజకీయమా?.. అయోధ్యలో రామమందిరం ఎంతో గొప్ప కార్యం. అంతటి మహోన్నత కార్యాన్ని కూడా రాజకీయం చేస్తున్నారనే విమర్శలు వినవస్తూనే ఉన్నాయి కదా!.. దేవుళ్లను ఆరాధించడం, ఆలయాలను అభివృద్ధి చేయడం మంచిదే కానీ.. దేవుళ్ల పేరుతో వ్యక్తిగత ప్రతిష్టలను, రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించడం ఎంతటివారికైనా సరే..ఎంతవరకు సమంజసం?..ఆలయాల్లో పాలకమండళ్లను పటిష్టం చేసి, తద్వారా దేవుళ్లకు చేయాల్సిన కైంకర్యాలను, లేదా ఉత్సవాలను మరింతగా అద్భుతంగా చేయాల్సిందిపోయి, 'దేవుడు చూడడం




లేదులే' అనుకొని.. తమ చిత్తానుసారం వ్యవహరించడం, సామాన్య భక్తులను చులకనగా చూడడం వంటివాటిని దేవుడు మెచ్చుతాడా?.. ఇటీవలి కాలంలో అనేక దేవాలయాల్లో జరిగే ఉత్సవాలు కూడా ఆయా పార్టీల వారి కనుసన్నల్లోనే జరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జనం గుంపులుగా చేరిన కాడల్లా తమ పార్టీపేరు చెప్పుకోవడం, లేదా తాము ఒక పెద్ద హీరోలా కనిపించి జనంలో గొప్ప నాయకుడిలా వ్యవహరించడం మామూలైపోతోంది. అయితే, నిజమైన భక్తి కలిగినవాళ్లు రాజకీయ నాయకులైనా.. కాకపోయినా వారిని తప్పకుండా అందరం గౌరవించుకోవాల్సిందే. అందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. కానీ, అసలు దేవుడంటే నమ్మకం లేనివాళ్లు కూడా కొన్ని ఆలయాల్లో తమ మాటే వేదంగా చెలాయించుకోవడం, మరికొందరు రాజకీయ ప్రాబల్యంతో పాలకమండళ్లలో చేరి దేవుళ్లనే శాసిస్తున్నట్లుగా వ్యవహరిస్తుండడాన్ని ఏమనుకోవాలో అర్థం కాదు. పీఠాధిపతులు, అర్చకులు, వేదపండితులు, ఆధ్యాత్మికవేత్తల సలహాలను పాటించకుండా ఎవరిపాటికి వారు తాము చెప్పిందే వేదం అనుకోవడం పరిపాటైపోతోంది. భక్తితో దేవుళ్లను కొలుచుకునేవారికి దేవాలయాల్లో కానీ, పాలకమండళ్లలో కానీ స్థానం లేకపోవడం, డబ్బు-రాజకీయ బలం ఉన్నవారికి మాత్రం అవి వేదికలు కావడం..కలియుగ ధర్మం కాబోలు!.. దేవుళ్ల ఆశీస్సుల కంటే రాజకీయనాయకుల ఆశీస్సులే నేటి సమాజంలో బాగా పనిచేస్తుండడం కాలమహిమో ఏమోమరి!.. ఏదేమైనా అలాంటి పద్ధతులు, గుళ్ల రాజకీయాలు పోవాలి. దేవుడి ముందు అందరూ సమానమనే భావన రావాలి. భక్తికి నిలయాలుగా, ధర్మానికి నెలవుగా ఉండాల్సిన దేవాలయాల్లో రాజకీయాల ప్రాబల్యం ఎంతమాత్రం మంచిది కాదు. ఆలయాల్లో ఏ చిన్న ఉద్యోగం వచ్చినా, చీపురు చేతపట్టి చెత్త వూడ్వాల్సివచ్చినా, పాలకమండళ్లలో చోటు దొరికినా.. ఆ దేవుని సేవాభాగ్యం లభించినట్లే. అంతకన్నా అదృష్టం ఏముంటుంది?.. అలాంటి సేవ పూర్వజన్మ సుకృతంతోనే లభిస్తుంది. చిత్తశుద్ధితో చేసే సేవలతో ఆ భగవంతుని అనుగ్రహం పొందాల్సింది పోయి, అనుచితమైన కార్యాలతో కలుషితం చేసుకోవడం వల్ల ఆ భగవంతుడిచ్చిన అద్భుత అవకాశాన్ని.. చేజేతులా పోగొట్టుకోవడమే కదా!.. ఓసారి మనసుపెట్టి ఆలోచించండి!

\- రాజశ్రీ

# నేటి రాజకీయాల వాస్తవస్థితికి అద్దం పట్టారు!

నిజాలను నిర్భయంగా, వార్తలను నిష్పక్షపాతంగా రాయడంలో చిన్న పత్రికల రంగానికే ఆదర్శం మన 'లాయర్'. ఇటీవల డిసెంబర్ 29 నాటి సంచికలో, "ఆంధ్రా పార్టీలకి అభ్యర్థులు కావలెను" అంటూ పతాక శీర్షికలో ప్రచురించిన వార్త అద్భుతం, అమోఘం. నేటి రాజకీయ రంగంలో రాజ్యమేలుతున్న రౌడీలు, గుండాలు, నేరస్తులు, నిరక్షరాస్యులు, అవినీతిపరులు, దోపిడీదారుల గురించి చక్కగా విశ్లేషించారు. ప్రస్తుత రాజకీయాలలో పోటీ చేయాలంటే ఎలాంటి అర్హతలు ఉండాలి అని మన 'లాయర్'లో చదివిన తరువాత రాజకీయాలంటే జుగుప్స కలుగుతోంది. గతవారం (జనవరి 12 సంచిక) 'సత్యపీఠం'లో గంజాయి సాగునీ చట్టబద్ధం చేసేస్తే బాగుంటుందని 'రాజశ్రీ' చేసిన సూచన కూడా ఆలోచనాత్మకంగావుంది. స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొన్న బెజవాడ గోపాలరెడ్డి, టంగుటూరు ప్రకాశం పంతులు, ప్రత్యేక రాష్ట్ర కోసం ప్రాణత్యాగంచేసిన పొట్టి శ్రీరాములు వంటి ఉద్దండులను, ఆ తరువాత కాలంలో ముఖ్యమంత్రులుగా వున్న పీ.వీ.నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, ఎన్.టి.రామారావు, వై. ఎస్.రాజశేఖరరెడ్డి లాంటి మహోన్నత ఆశయాలు కలిగిన రాజకీయ నాయకులను, వారి పాలనలో పనిచేసిన నేతలను చూసిన తెలుగువారు ప్రస్తుతం ఆంధ్రాలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆయన పార్టీ నేతలు సాగిస్తున్న అరాచకాలని చూసి సిగ్గుతో తలదించుకోవలసి వస్తోంది.

\- యం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

ఈ-మెయిల్

## ప్రజావాణి

lawyerpatrika@gmail.com

WhatsApp +91 98663 14741

# రాత్రి వేళల్లో మెడికల్ షాపులు కావాలి!

అనూహ్యంగా పెరుగుతున్న జనాభాకి తగ్గట్లుగా నెల్లూరు నగరం కూడా నాలుగువైపులా శరవేగంగా విస్తరిస్తోంది. నగరం ఎంత పెరిగినా ప్రధాన రహదారులు మాత్రం రెండే. ఒకటి అయ్యప్పగుడి నుండి మొదలై ఆత్మకూరు బస్టాండు వరకు వున్న అతి పురాతనమైన ట్రంకురోడ్డు. రెండవది అదే అయ్యప్పగుడి వద్ద నుండి మొదలై అదే ఆత్మకూరు బస్టాండు వద్ద కలిసే మినీబైపాసు రోడ్డు. ఇది 1994 తరువాత ఏర్పడింది. ఈ రోడ్డుకి అప్పుడెప్పుడో కాంగ్రెస్ హయాంలో రాజీవ్ రహదారి అని పేరుకూడా పెట్టారు. బహుశా ఆ పేరు పెట్టినోళ్లకన్నా అది గుర్తుందో లేదో. అసలు నేను చెప్పొచ్చేదేంటంటే... ఇంతగా పెరిగిన నగరం, ఉదయం సమయాల్లో నిత్యం షాపులు, ట్రాఫిక్కు , వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు కనిపిస్తూ కళకళలాడిపోతుంటుంది. రాత్రివేళల్లో మాత్రం నిశ్శబ్దంగా మారి స్మశాన వాతావరణాన్ని తలపిస్తోంది. అటు వేదాయపాలెం నుండి బొల్లినేని ఆసుపత్రి వరకు, ఇటు ఆత్మకూరు బస్టాండు దగ్గర నుండి ఆర్.టీ.సీ బస్టాండు వరకు బూతద్దం పెట్టి వెతికినా రాత్రి వేళల్లో కనీసం ఒక్క మందుల దుకాణం కూడా కనపడిచావదు. రాత్రివేళల్లో ఏదైనా చిన్న అవసరమొచ్చినా చిన్న తలనొప్పి మాత్ర దొరకాలన్నా తలనొప్పే. ప్రభుత్వ వైద్య కళాశాల, పెద్దాసుపత్రి పరిసరాల్లో సైతం ఒక్క మెడికల్ షాపు కూడా రాత్రి వేళల్లో తెరిచివుండదు. రెడ్‌క్రాస్ వంటి ఆరోగ్య సేవాసంస్థలైనా ఈ విషయంపై దృష్టిపెట్టి అత్యవసర మందులతో రాత్రివేళల్లో కూడా మెడికల్ షాపులు పనిచేసేలా ప్రయత్నం చేస్తే బాగుంటుందేమో!

\- కే.భాస్కరశర్మ, పోస్టల్ కాలనీ, నెల్లూరు.



## పర్వతరెడ్డికి.. ఆదాల పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తూర్పు రాయలసీమ వైకాపా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఇటీవల నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు కొండ్రెడ్డి రంగారెడ్డి, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, స్వర్ణ వెంకయ్య, జీవి ప్రసాద్, మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.





## ఆటపాటలతో సంబరంగా.. 'ఏటి పండుగ'

### ○ వేలాదిమంది ప్రజలతో హోరెత్తిన పెన్నాతీరం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతిఏటా జరిగే 'ఏటి పండుగ' ఈసారి బుధవారం (ఈనెల 17)న మరింత వైభవంగా జరిగింది. నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట వద్ద పెన్నానది తీరానికి వేలాదిమంది ప్రజలు తరలివచ్చి ఆటపాటలతో గడిపారు. దీంతో పెన్నా తీరం జనసంద్రంగా మారింది. పిల్లలు, పెద్దలు అందరూ కుటుంబాలతో సహా కదలివచ్చి ఈ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇసుక తిన్నెల్లో గొబ్బెమ్మలకు పూజలు చేశారు. ధనుర్మాసంలో ఇళ్ళ వద్ద తాము పూజలు చేసిన గొబ్బెమ్మలను పవిత్రమైన పినాకినీ నది జలాల్లో నిమజ్జనం చేశారు. మహిళలు, చిన్నారులు ఎంతో సంబరంగా గాలిపటాలు ఎగురవేశారు. ఏడాదికోసారి కనుమపండుగ తర్వాత జరిగే ఈ ఏటిపండుగ నెల్లూరుకే ప్రత్యేకం. ఈ సందర్భంగా పెన్నా బ్యారేజీని విద్యుత్‌దీపాలతో దేదీప్యమానం చేశారు. పలు ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల నుంచి దేవతామూర్తులు పెన్నాతీరంలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. పెన్నా నదిలో ఏటి పండుగ సంబరాలు చేసుకోవడం, చెంతనే ఉన్న శ్రీ రంగనాథస్వామిని దర్శించుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

## వేమిరెడ్డికి.. అంగన్‌వాడీల వినతి



రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైకాపా ఎంపీ అభ్యర్థి, జిల్లా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్)ని ఇటీవల పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాగుంట లేఅవుట్‌లోని ఆయన నివాసంలో కలసి, తమ సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించడానికి కృషిచేయాలంటూ ఆయనకు వినతి పత్రం అందించారు. అందుకు సానుకూలంగా స్పందించిన విపిఆర్, వారి డిమాండ్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. దాంతో అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## పీఏ వెంకటేశ్వర్లు కుటుంబానికి.. పర్వతరెడ్డి పలకరింపు



ఇటీవల తనతోపాటు కారులో ప్రయాణిస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన పీఏ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బాధాతప్త హృదయంతో పరామర్శించారు. ఈ దుర్ఘటనలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి కూడా తీవ్రంగా గాయపడడం, దైవానుగ్రహంతో ఆ పెద్ద ప్రమాదం నుంచి బయటపడి, ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన కారులోనే ప్రయాణిస్తూ ఆ ప్రమాదంలో వెంకటేశ్వర్లు మృతిచెందడం ఎంతో బాధాకరమని ఆయన కన్నీరుపెట్టుకున్నారు. తాను కొద్దిగా కోలుకోగానే వెంకటగిరిలోని వెంకటేశ్వర్లు నివాసానికి తన కుటుంబసభ్యులతో కలిసి వెళ్ళి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను పలుకరించారు. వెంకటేశ్వర్లు మృతి తననెంతగానో కలచివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు దశాబ్దానికి పైగా తనవద్ద పనిచేసిన వెంకటేశ్వర్లు సేవలను తాను ఎప్పటికీ మరువలేనన్నారు. నిన్నటివరకు తనతోనే ఉన్న పి.ఏ ఇప్పుడు లేడంటే నమ్మశక్యం కావడంలేదని బాధపడ్డారు. వారి కుటుంబానికి తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. తొలుత ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి కన్నీటి నివాళులర్పించారు.

### నరేంద్రబాబుకు
## సాహిత్య అకాడమీ పురస్కారం



ప్రముఖ కవి, రచయిత నెల్లూరులోని కెవెన్ఆర్ నగరపాలక ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబుకు రాష్ట్ర సాహిత్య అకాడమీ విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఏలూరులో ఇటీవల నిర్వహించిన 'సాహిత్య సంక్రాంతి సంబరాలు' కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు పి.శ్రీలక్ష్మి, ఏలూరు శాసనసభ్యులు ఆళ్ళ కాళీకృష్ణశ్రీనివాస్, డా. బోయి భీమన్న సతీమణి హైమావతి, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తదితరుల చేతుల మీదుగా ఆయన జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతోపాటు, 5 వేల రూపాయల నగదు బహుమతిని కూడా అందుకున్నారు. 10 ఆంధ్ర నేవల్ యూనిట్‌కు అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా కూడా పనిచేస్తున్న నరేంద్రబాబు అవార్డు అందుకున్న సందర్భంగా సాహితీమిత్రులు, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

• మధుర జ్ఞాపకం

## కల నెరవేరుతున్న వేళ.. ఓ కరసేవకుడి ఆనంద హేల!

ఉత్తరప్రదేశ్‌లోని రామజన్మభూమి అయోధ్యలో దాదాపు 500 సంవత్సరాల తర్వాత బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మరియు భవ్యమైన, దివ్యమైన రామాలయం నిర్మిస్తున్న సందర్భంగా 1990లో అయోధ్యలో జరిగిన కరసేవలో నాడు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మరియు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఉన్న నేను, అయోధ్యలో జరిగిన కరసేవలో ప్రత్యక్షంగా పాల్గొనటం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. ఆనాడు అయోధ్యలో జరిగిన కరసేవకి సంబంధించి కొన్ని సంఘటనలని గుర్తుకు తెచ్చుకుంటూ ఆనాటి మధురజ్ఞాపకాలను మన 'లాయర్' పాఠకులతో పంచుకుంటున్నాను.

అయోధ్యలో జరప తలపెట్టిన కరసేవకు, నెల్లూరుజిల్లాలోని మా స్వగ్రామమైన వింజమూరు నుండి బయలుదేరి, జిల్లాలోని వివిధ గ్రామాలనుండి కరసేవకు తరలివచ్చిన రామదండును నెల్లూరులో కలుసుకున్నాను. ఈ బృందానికి ఆనాటి విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీ ప్రసాద్ నాయకత్వం వహించారు. అందరం నెల్లూరు నుండి రైలులో అయోధ్యకు బయలుదేరాం. దారి పొడవునా.. రైలు ఆగిన చోటల్లా పోలీసు బలగాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. ప్రతి ఒక్క కరసేవకులం టిక్కెట్ కొని ప్రయాణించాం. అంతేకాకుండా అందరం ఒకే దగ్గర గుమికూడినట్లు కాకుండా, రైలులోని అన్ని బోగీల్లో చెదురుమదురుగా ఒకరికొకరం సంబంధం లేనట్లు ప్రయాణం సాగించాం. కాబట్టి కొంత దూరం పోలీసులు నుండి తప్పించుకోగలిగాం. నాగపూర్ దాకా ప్రయాణం సాఫీగా జరిగినప్పటికీ, నాగపూర్‌లో కట్టుదిట్టమైన పోలీస్ తనిఖీలు జరిగాయి. అనేకమంది కరసేవకులను అరెస్టు చేసి వెనకకు తరిమేశారు.

కానీ మేం కొద్దిమంది కరసేవకులం మాత్రం పోలీసుల కళ్ళు కప్పి రైలు దిగి బస్సులు, లారీలు పట్టుకుని లక్నోకు, అక్కడ నుండి అయోధ్య సరిహద్దులకు చేరుకున్నాం. అప్పటికే కొన్ని వేలమంది కరసేవకులు అయోధ్య సరిహద్దులకు చేరుకొని కరసేవకై ఉవ్విళ్లూరుతున్నారు. అంతే స్థాయిలో పోలీసు బలగాలు సైతం అయోధ్యను చుట్టుముట్టి కరసేవకులెవ్వరూ అయోధ్యలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అయితే మేం కొద్దిమందిమి రాత్రిపూట సరయు నదిని కాలి బాటలో దాటి అయోధ్యలోకి ప్రవేశించాం. సరయు నదిని దాటేటప్పుడు అక్కడ ఉన్న మత్స్యకారుల సలహా ప్రకారం చివరగా నడిచివచ్చే వ్యక్తి ముందునుంచి వెళ్లిన వారి అందరి పాదముద్రలను ఇసుకలో తుడిచి, ఎటువంటి ఆనవాళ్లు లేకుండా జాగ్రత్తపడ్డాం.

అప్పటికే కరసేవకులపై పోలీసులు దాడుల గురించి అనేకానేకమైన వార్తలు వినపడుతున్నాయి, అయినా మేము భయపడకుండా ధైర్యంగా రాములోరి మందిర నిర్మాణ కరసేవకై కంకణబద్ధులమై వేకువజామున అయోధ్యలోకి ప్రవేశించగలిగాం. ఎంతోమంది కన్నుగప్పి అంతదూరం చేరినప్పటికీ చివరికి పోలీసులకి దొరికిపోయాం. మమ్మల్ని అరెస్టుచేసి అయోధ్యకు దగ్గరలో ఉన్న జిల్లా జైలుకు తరలించారు. అప్పటికే జిల్లా జైలులో అనేక వందలమంది కరసేవకులు అరెస్టయి ఉండటంవల్ల బయట పరదాలు వేసి మమ్మల్నందరినీ అక్కడ బంధించారు. అక్కడి స్థానిక ప్రజలు మాకు కావాల్సిన తాగునీరు, ఉపాహారాలు, భోజనాలు స్వచ్ఛందంగా అందజేశారు. అయోధ్య పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన చాలామంది కరసేవకులను స్వాగతించి, ఆదరించి పోలీసుల కంటపడకుండా కాపాడారు. ఒక ఆధ్యాత్మిక లక్ష్యంతో, దృఢమైన ధ్యేయంతో కరసేవలో పాల్గొనడానికి వచ్చి అయోధ్యలోని గుడికి దగ్గరగా చేరుకున్న చాలామంది కరసేవకులు పోలీసుల దాష్టీకానికి బలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్ళీ అయోధ్యకు వెళ్లి దూరం నుండి రామ మందిరాన్ని దర్శించుకుని అలహాబాద్ మీదుగా తిరిగి అందరం నెల్లూరుకు చేరుకున్నాం.

దాదాపు 35 సంవత్సరాల తర్వాత అనేకమంది కరసేవకుల బలిదానాలు, రామ భక్తుల యొక్క త్యాగాలు, పోరాటాల ఫలితంగా జనవరి 22వ తేదీన అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట జరగబోతోంది. భవ్యమైన, దివ్యమైన రామమందిరం అవతరించబోతోంది. ఈ మహోన్నత కార్యక్రమంలో శ్రీరాముడికి ఉడుత సాయంలా నేనూ ఒక కరసేవకుడిగా పాల్గొనడం ఎన్ని జన్మల పుణ్యమో....!

జై శ్రీరామ్! జై జై శ్రీరామ్!!



**ఆచార్య వై.వి.రామిరెడ్డి**
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

# నెల్లూరు కబుర్లు

## డా. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

**జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికులని, జాతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆ మహనీయుని గురించి రాబోయే తరాలవారు కూడా తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల డా. అంబేద్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని విఆర్‌సి కూడలి వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ఏర్పాటుచేసిన మానవహారం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్‌లతో కలసి విఆర్‌సి కూడలిలోని డా. అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'నేను సైతం' రక్తదానం



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ – నెల్లూరుజిల్లా శాఖ రక్తనిధి కేంద్రం, 'నేను సైతం' చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఈనెల 12న నగరంలోని ఏసీ స్టేడియంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్లడ్ సెంటర్ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు, ట్రస్ట్ ఆర్గనైజర్ జి.మాధవ్, రెడ్‌క్రాస్ మెడికల్ షాప్ కన్వీనర్ యు. మురళీకృష్ణ, ఎ. సాయిరాం, ట్రస్ట్ వ్యవస్థాపకులు జి. హరి నివాస్, సిరి నిత్యేష్, సభ్యులు ధనుష్, చంద్ర, లక్ష్మి మాధవ్, శైలజ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



### సుదర్శన యాగానికి..

## వేమిరెడ్డి దంపతులను ఆహ్వానించిన ప్రసన్న

రానున్న ఎన్నికల్లో వైకాపా ఘనవిజయం సాధించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని ఆ పరమేశ్వరుని కోరుకుంటూ ఈనెల 20వ తేదీ శనివారంనాడు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల దాకా అత్యంత వైభవంగా తాము నిర్వహించనున్న సుదర్శన యాగానికి రావలసిందిగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఆయన సతీమణి.. టీటీడీ ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి (న్యూఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని వేమిరెడ్డి దంపతుల నివాసంలో వారిని కలసి యాగం వివరాలను తెలియజేశారు. కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెం గ్రామంలో నిర్వహించే ఈ యాగంలో శ్రీ నారికేళ సహిత రసలింగేశ్వర (పాదరసం) మహారుద్రాభిషేకం, సుదర్శనయాగం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతాయని, 'మీరు కూడా పాల్గొని స్వామివారు–అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని' ఆయన కోరారు. అందుకు వేమిరెడ్డి దంపతులు సంతోషంగా సమ్మతిస్తూ, తప్పకుండా యాగానికి వస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న వెంట కోవూరు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## నెహ్రూయువ కేంద్ర.. యువజన దినోత్సవం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు–క్రీడ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర, కేంద్రీయ విద్యాలయ సంయుక్త సారధ్యంలో ఇటీవల జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య, ప్రిన్సిపల్ శంకరయ్య, ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల–నందవరం ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యువజన అధికారి ఏ.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని యువత అభివృద్ధి చెందాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని ఆకాంక్షించారు.

## రూ.25 కోట్లతో ఆటోనగర్ అభివృద్ధి

**- ఎంపీ ఆదాల**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు ఆటోనగర్ అభివృద్ధికి దాదాపు 25 కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయడం జరిగిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన రూరల్‌లోని 29వ డివిజన్‌లో సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఆటోనగర్‌లో 42 లక్షల రూపాయల వ్యయంతో రోడ్లు, పారిశుద్ధ్య పనుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ఆటోనగర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ లేకుండా పనిచేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు నగర మేయర్ స్రవంతి, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణ వెంకయ్య, ఆటోనగర్ అసోసియేషన్ ఛైర్మెన్ సిహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి మహా హారతి





మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 15న నెల్లూరు వేదయపాలెంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. శబరిమలైలో మకర జ్యోతి దర్శనం సందర్భంగా సరిగ్గా అదే సమయానికి సాయంత్రం 6 గంటలకు అయ్యప్ప స్వామివారికి మహా హారతి సమర్పించారు. తదుపరి కర్పూర జ్యోతి దర్శనం జరిగింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ భక్తుల శరణు ఘోషల మధ్య ఆలయ శిఖరంపై జ్యోతిని వెలిగించారు. దేవస్థానం కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కేజీ శంకరన్, నాగేశ్వరరావు, జీవి కృష్ణారెడ్డి, బొగ్గుల మురళిమోహన్‌రెడ్డి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 89వ భాగం

అర్జునుడు, ధర్మరాజు దగ్గర ప్రతిస్మృతి మంత్రాన్ని స్వీకరించి, ఆయుధధారుడై ఈశాన్య దిశగా ప్రయాణమవుతాడు. బ్రాహ్మణ రూపంలో దేవేంద్రుడు ప్రత్యక్షమై పరమశివుని గురించి శస్త్ర, అస్త్రాల కోసం తపస్సు చెయ్యమంటాడు. అర్జునుడు శివుని గురించి ఘోర తపస్సు చేస్తుంటే, చుట్టుపక్కల ప్రాణి కోటి భయాన్ని పోగొట్టటానికి కొంతమంది మునీశ్వరులు కైలాసం వెళ్లి శివుణ్ణి ప్రార్థిస్తారు. పరమశివుడు, పార్వతిదేవితో కిరాత రూపంలో ప్రథమ గణాలతో బయలుదేరి, మూకాసురుడనే




రాక్షసుణ్ణి అడవి పంది రూపంతో అర్జునుని మీదకు లంఘించమంటాడు. అర్జునుడు అడవిపంది మీద ముందు బాణాలు వేస్తే, దాని మీద శివుడు కూడా బాణాలు వేశాడని కోపం వచ్చి యుద్ధానికి దిగుతాడు. కానీ అర్జునుడి ఆయుధాలన్నీ శివుని మాయ వల్ల అదృశ్యమవుతాయి. అర్జునుడు పట్టుదలతో శివునితో మల్లయుద్ధం తలపెట్టినప్పుడు, శివుడు అభినందించి, అర్జునుణ్ణి మూర్ఛిల్లచేసి, లేవగానే తన దివ్య దర్శనాన్ని సాక్షాత్కరింప చేస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






## షర్మిల నియామకం.. హర్షదాయకం



**- డీసీసీ నేత చేవూరు**

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం ద్వారా పూర్వవైభవాన్ని తీసుకువచ్చి, కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమితురాలైన వైఎస్ షర్మిల నియామకాన్ని హర్షిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మెన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా ప్రతిఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని, ప్రస్తుత రాజకీయ పార్టీలు ప్రజల్ని చిన్నాభిన్నం చేస్తున్న తీరును రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యే రీతిలో బహిర్గతం చేయాలని, తద్వారా కాంగ్రెస్ పార్టీని మరింతగా పటిష్టం చేసేందుకు ఆమె విశేష కృషిచేయాలని ఆయన ఆకాంక్షించారు. సామాన్యుడిని సైతం ఉన్నతస్థాయిలో గౌరవించడం, దేశ ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో ప్రతిఒక్కరు హర్షించదగ్గ నిర్ణయాలను తీసుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి ధీటైన పార్టీలు దేశంలో లేవని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## 'గీతామయి'లో వృద్ధులకు పండ్లు పంపిణీ

స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు నెహ్రూ యువకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

# గ్రామీణుల దాహార్తి తీర్చేందుకే.. 'అమృతధార'

## - రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి



జిల్లాలో త్రాగునీటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా తాము విపిఆర్ అమృతధార కార్యక్రమం చేపట్టామని, 2017 నుంచి ఇప్పటిదాకా 115 వాటర్ ప్లాంట్లను పల్లెటూళ్ళలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో దాదాపు 30 వాటర్‌ప్లాంట్లను ఉదయగిరి ప్రాంతానికే కేటాయించామని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు, 'సేవాభూషణులు' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. ఇటీవల ఆయన ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం ఎన్బీ కాలనీలో, ఉదయగిరి మండలం లోని కుర్రపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమృతధార వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయగిరి ప్రాంత ప్రజలు తమపై ఎంతో ఆప్యాయత చూపుతారని, అందుకే ఈ ప్రాంతమంటే తనకు ప్రత్యేక అభిమానమన్నారు. ప్లాంట్‌ల ఏర్పాటుతో పాటు వాటి నిర్వహణ, మరమ్మతులు కూడా విపిఆర్ ఫౌండేషన్ చూసుకుంటుం దని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎంపీగా, రాజగోపాల్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత, ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్‌బి కాలనీకి చేరుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి గ్రామస్తులు కర్పూర హారతులు, బాణసంచా వేడుకలతో ఘన స్వాగతం పలికారు.



## వెంకటగిరి ఓటర్లకి రామ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థన

# మీ సేవ చేసే భాగ్యం కల్పించండి

'రానున్న ఎన్నికల్లో వైకాపాను, తమను గెలిపించి మీకు సేవ చేసే భాగ్యం కల్పించాలని' రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు అధ్యక్షులు, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గూడూరు నియోజకవర్గం తమ సొంత నియోజకవర్గమని, తమ తండ్రి..మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మి ఆ నియోజకవర్గానికి శాశ్వత ప్రాతిపదికన ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా మేరిగ మురళిని నియమితులయ్యారని, ప్రజలు మురళిని కూడా ఆదరించాలని కోరారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య పోటీలో ఉంటారని, వెంకటగిరి నియోజకవర్గానికి ఎమ్యెల్యే అభ్యర్థిగా తనను నియమించారని, రాబోయే ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు.

# శ్రీసిటీలో సంక్రాంతి సంబరాలు





శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా, శ్రీసిటీ లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు, కోలాటం తదితర కార్యక్రమాలు జరిగాయి. ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు శ్రీసిటీలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, పరిసర గ్రామాల మహిళలు ఉత్సాహంగా వచ్చారు. మరోవైపు ఆరూరు గ్రామస్తుల కోలాట నృత్యాలు అలరించాయి. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నా రెడ్డి, శ్రీసిటీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డితో పాటు ముఖ్య అతిధులుగా పాల్గొన్న అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్, ఆయన సతీమణి ప్రియాసింగ్ శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శిం చుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలుగా నిలిచిన కీర్తన, నిషా, పూర్ణిమలు అడిషనల్ డీజీపీ సతీమణి ప్రియా సింగ్ నుంచి నగదు బహుమతులు అందుకున్నారు.









# విద్యాదాత బాలకృష్ణారెడ్డికి.. రామ్ నివాళి

విద్యాదాత, దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 15న వాకాడులోని ఆయన సమాధికి పూలమాలవేసి నివాళులర్పించిన రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి (బాబురెడ్డి).

## ఆయన సేవలు చిరస్మరణీయం - ఎన్‌బికెఆర్ డైరెక్టర్

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్‌కు ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, విద్యాప్రదాత దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు అమోఘమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. బాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 15న కళాశాలలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుకుని సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఎందరో పేద విద్యార్థులకు విద్యాదానం చేసి వారి హృదయాల్లో ఆయన చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో నేటికీ వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. బాలకృష్ణారెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని, ఆయన ఆశయసాధన కోసం కృషిచేస్తామని ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ కళాశాలలోని అన్ని విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్లువెత్తిన సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పర్వదినాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పండుగ సంబరాలు వెల్లువెత్తాయి. ప్రజలు ఈ మూడురోజుల పండుగలను ఆనందంగా జరుపుకున్నారు. నెల్లూరు నగరంలోనూ సంక్రాంతి కాంతులు వెల్లివిరిశాయి. భోగి, సంక్రాంతి రోజుల్లో ఆలయాలకు పెద్దఎత్తున తరలివెళ్ళి పూజలు చేసుకున్నారు. కనుమ పండుగరోజున నగరంలోని నవలాకుల తోటలో దేవతామూర్తులంతా కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం ఒక ప్రత్యేకతగా నిలిచింది. శ్రీ రంగనాథస్వామి, మూలస్థానేశ్వరస్వామి, ధర్మరాజస్వామి, వేణుగోపాలస్వామి, ఉమామహేశ్వరస్వామితో పాటు సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరిదేవి అమ్మవారు, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, సిద్ధి విఘ్నేశ్వరస్వామి, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి, శివకేశవులు, అవధూత.. గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయాల నుంచి దేవతామూర్తులు కదలి వచ్చారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా మైపాడు గేటు సమీపంలోని జాఫర్‌సాహెబ్‌కాలువ వద్ద శివపార్వతుల తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఈ వేడుక కన్నులపండువగా జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అనేక మంది నాయకులు, వేలసంఖ్యలో ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## • నవలాకులతోటలో కొలువుదీరిన దేవతామూర్తులు



## పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు



సంక్రాంతి పర్వదినాల సందర్భంగా నగరంలోని పెన్నా తీరం వద్ద ఉన్న బోడిగాడితోట సమాధుల వద్ద సంబంధిత కుటుంబాల వారు సమాధులను పూలతో అలంకరించి, పితృదేవతలను స్మరించుకుంటూ ధూపదీపాలు వెలిగించి పూజలు చేశారు. కీర్తిశేషులైన తమ పెద్దలకు ప్రీతిపాత్రమైన వంటకాలను సమర్పించుకుని దండాలు పెట్టుకున్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సమాధుల ప్రాంతం క్రిక్కిరిసిపోయింది. 'పెద్దల పండుగ' సందర్భంగా, గతించిన తమ పెద్దల ఆత్మలకి శాంతి కలగాలని వారంతా ప్రార్థించారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## రోడ్లు గుల్లచేస్తున్నారు

గూడూరులో రోడ్లు గుల్ల గుల్లైపోతున్నాయి. గత సంవత్సర కాలంగా ఏజీపీ గ్యాస్ కంపెనీ వాళ్ళు పైప్‌లైన్ల కోసమంటూ ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేస్తున్నారు. ప్రధాన రోడ్లతో పాటు చిన్నచిన్న సందుల్లో సైతం సిమెంటు రోడ్లను పగలకొట్టేస్తున్నారు. దీంతో తాము నానా ఇబ్బందులు పడుతున్నామని, మునిసిపల్ కమిషనర్‌కు సమస్యను మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు.



## పని ఒత్తిడిలో ఆటవిడుపు క్రికెట్

నిత్యం పని ఒత్తిడిలో ఉండే ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారికి, పాత్రికేయులకు క్రికెట్ టోర్నమెంట్ ఆటవిడుపుగా ఉంటుందని గూడూరు రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఉద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సభ్యులు ఒక వేదిక మీదకి వచ్చి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.

## కోదండరామస్వామి తెప్పోత్సవం



గూడూరు కోనేటి మిట్టలో వెలసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానం నందు ఈ నెల 16వ తేదీ శ్రీరాముల వారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయకర్త కనుమూరు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ తెప్పోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఏ.శివకుమార్ ఆధ్వర్యంలో ఇటీవల బ్రాహ్మణ భవనంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 25 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ హారిక చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు శ్రీనివాసరావు, లలితమ్మ, పురుషోత్తమరావు, శ్రీనివాసరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రగతి' చీరల పంపిణీ



గూడూరులోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఈ నెల 17న 60 మంది నిరుపేద మహిళలకు చికెన్ బిర్యానీ, చీరలు పంపిణీ చేశారు. తమ తండ్రి ఆర్ముగం 21వ వర్ధంతి సందర్భంగా రమేష్ బేకరీ అధినేత రమేష్ ఈ పంపిణీ కార్యక్రమానికి దాతగా వ్యవహరించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, గోపి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గొలుసు దొంగలు చిక్కారు



గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒంటరి మహిళల మెడలో బంగారు గొలుసులను అపహరిస్తున్న ఇద్దరు యువకులు చిట్టేటి అనిల్‌కుమార్, సంక్రాంతి శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 9 లక్షల విలువచేసే 142 తులాల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గూడూరు రూరల్ సి.ఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సై మనోజ్‌కుమార్‌లు మీడియాకు ఆ వివరాలను వెల్లడించారు.

# జగన్‌ను మళ్ళీ గెలిపించుకోవాలి

**- రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్)**




రానున్న ఎన్నికల్లో వైకాపాను గెలిపించుకోవాలని, మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విజయం సాధించి పెట్టాలని నెల్లూరు రూరల్ 20వ డివిజన్ ఇన్‌చార్జి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇటీవల ఆ డివిజన్‌లోని సచివాలయం పరిధిలో 'ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు అవసరం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌కు అందరూ అండగా ఉండాలని, నెల్లూరు రూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని, అదేవిధంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడుగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మద్దతు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.



## శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో

# అన్నప్రసాద వితరణ

నెల్లూరు రేబాలవీధి సమీపంలోని సీఆర్పీ డొంకలో ఉన్న శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో కనుమ పండుగ సందర్భంగా ఈనెల 16న అమ్మవారికి విశేష అభిషేకాలు, సహస్రనామార్చన, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పీటీ జగన్నాథం-పద్మజ దంపతులచే భక్తులకు పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది.

# పద్యసారస్వత పరిషత్ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు ఏసీ నగర్‌లోని వివేకానంద ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల పద్య సారస్వత పరిషత్ 6వ వార్షికోత్సవ వేడుకలు అధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. తొలుత సంక్రాంతి సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించారు. విద్వాన్ డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు రచించిన 'సుందర కాండము' కావ్యాన్ని మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్ ఆవిష్కరించగా, అవధాని కోట రాజశేఖర్ సమీక్షించారు. అనంతరం కావ్యకర్త డా. చీమకుర్తిని అభినందించి సత్కరించారు. అదేవిధంగా, ఇటీవల ఏలూరులో రాష్ట్ర సాహిత్య అకాడమీ విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకున్న గుండాల నరేంద్రబాబును కూడా నిర్వాహకులు సన్మానించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ ఉపాధ్యక్షులు నలుబోలు బాలరామయ్యనాయుడు, సాహితీవేత్తలు అగస్త్యరాజు సుబ్బారావు, కోట శ్రీరామమూర్తి, ఆలూరు శిరోమణిశర్మ, సూరం చంద్రశేఖర్, వనం సుబ్రహ్మణ్యం, గోవిందరాజు సుభద్రాదేవి, ఎం.నరేంద్ర, ముకుందరామారావు పాల్గొన్నారు.

# "అయ్యో రామా"లయం!

మరో నాలుగు రోజుల్లో భారతీయ జనతా పార్టీ "రామ భక్తి" పరాకాష్టకు చేరబోతోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య నగరంలో రాములవారి దేవాలయంలో రాములవారి విగ్రహానికి... దేశ ప్రధాని పదవిలో ఉన్న నరేంద్రమోడీ ప్రాణప్రతిష్ట చేస్తారు.

"నరేంద్రమోడీ పీఠాధిపతా?"

"కాదు..."

"మరి, వేద వేదాంగ పండితుడా?"

"కాదు..."

"అయోధ్య రామాలయ స్వాముల వారా?"

"కాదు..."

"మరి, రాముల వారి విగ్రహానికి ప్రాణప్రతిష్ట ఎలా చేస్తారు!?'

"చేస్తారు. అడగడానికి నువ్వెవడివి?"

"అని కాదు. 140 కోట్ల జనాభా కలిగిన ఒక లౌకిక రాజ్యాధిపతి కదా ఆయన. అందుకని ఈ సందేహం. హిందూ మతానికి చెందిన రామాలయ ప్రారంభానికి చెందిన కార్యక్రమాన్ని ఆ మతానికి చెందిన వారికే వదిలేయాలి కదా అనేది డౌటు...."

"మరి ప్రధాని.... ముస్లిం మతస్తులకూ ప్రధానే. క్రిస్టియన్ మతస్తులకూ ప్రధానే కదా! ఓ మసీదు ప్రారంభానికో, చర్చి ప్రారంభానికో కూడా వెళతారా...?"

అలా, అడగడం ఇష్టం లేకనే దేశంలోని నాలుగు శంకరాచార్య పీఠాధిపతులు అయోధ్య వైపు కన్నెత్తి చూడడం లేదు.

ప్రధాని నరేంద్రమోడీ ఒక పీఠాధిపతిని తలపింప చేసే వేషధారణతో... ఆయన ఒక్కరే.... శ్రీరాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తుంటే అసలైన పీఠాధిపతులు మాత్రం... నిస్సహాయంగా చూస్తూ, గ్యాలరీల్లో కూర్చుని ఆ దృశ్యం చూస్తూ కూర్చోడం ఇష్టం లేకనే వారు అయోధ్య వైపు కన్నెత్తి చూడడం లేదు. రాముల వారి దేవాలయం గానీ, స్వాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు గానీ, వాటికి సంబంధించిన క్రతువులు గానీ... పీఠాధిపతులకు ఒక పవిత్ర దైవ కార్యం. భారతదేశంలో హైందవ ధర్మ పరిరక్షణ కొనసాగింపులో భాగం. వారి సారధ్యంలో జరగవలసిన క్రతువు ఇది.

బీజేపీకి మాత్రం... రేపు లోకసభ ఎన్నికలలోపు జరగవలసిన ఒక రాజకీయ క్రతువు. ఓటర్ల మస్తిష్కంపై నరేంద్ర మోడీ కప్పబోయే ఓ మాయ తెర.

అందుకని శంకరాచార్యుల వారి పీఠాధిపతులతో సంబంధం లేదు. ఆలయ నిర్మాణం సంపూర్ణం కాకుండానే రాముల వారి విగ్రహానికి ఎలా ప్రాణ ప్రతిష్ట చేస్తారంటూ వారు వేసే ప్రశ్నలతో సంబంధంలేదు. ఓ పక్కన లోక్‌సభ ఎన్నికలు తరుముకు వస్తుంటే, ఈ ప్రశ్నలకు సమయం లేదు. ఎన్నికల లోపు ఒక రోడ్డుకో, బ్రిడ్జికో, ఫ్యాక్టరీకో ప్రారంభోత్సవానికి పాలకులు ఉరుకులు, పరుగులు పెట్టినట్టు బీజేపీ పెద్దలు... అయోధ్యలో రాములవారి విగ్రహాల ప్రాణప్రతిష్టకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

ఈ ప్రాణ ప్రతిష్టకు ఇంకో విశేషం ఉంది.

శ్రీరామచంద్రుడు..., తన భార్య కోసం జీవితాన్ని త్యాగం చేశాడు. అరణ్యవాసంలో... భార్యామణి సీతాదేవికి కష్టం కలగకుండా చేయగలిగినంత చేశాడు. ఆ సాధ్విని రావాణాసురుడు మాయోపాయం చేత అపహరించుకు పోతే, సకల దేవతలు కన్నీరు మున్నీరయ్యేంతగా విలపించాడు. ఆమెను వెదకడానికి సర్వశక్తులూ ధారపోశాడు. చివరకు వానరాలతో సైతం స్నేహం చేశాడు. ఆమె లంకలో ఉందని తెలియగానే, రావణుడిపై యుద్ధానికి సిద్ధమయ్యాడు.

చివరికి, రావణుడిని, అతని సమస్త పరివారాన్ని సంహరించి, సీతాదేవిని రక్షించుకున్నాడు. చరితార్థుడయ్యాడు. తన భార్యకు శ్రీరామచంద్రుడు ఇచ్చిన విలువ, గౌరవం అది. అందుకే, ఇంటింటి ఇలవేలుపు అయ్యాడు. ఎప్పుడో త్రేతాయుగం వాడయినప్పటికీ మనకు నిన్నగాక మొన్నటివాడు గానే రాముడు కనిపిస్తున్నాడు.

అటువంటి రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తున్న నరేంద్ర మోడీకి వివాహ వ్యవస్థ మీద నమ్మకం లేదని, చేసుకున్న భార్య మీద గౌరవం లేదని గత పదేళ్లలో చోటుచేసుకున్న అనేక సంఘటనలు రుజువు చేస్తాయి.

ఆయన ఈ పదేళ్లలో 60 దేశాలకుపైగా పర్యటించారు. ఒక్కరే వెళ్లారు. ఆయన వెళ్లిన చోటల్లా ఆయా దేశాధినేతలు... తమ సతీమణులతో సహా స్వాగతం చెప్పారు, అమెరికా అధ్యక్షులతో సహా. మోడీతో ఆ భార్యాభర్తలు ఇద్దరూ కరచాలనాలు చేశారు. ఇక దేశంలో దేవాలయాలు ఎన్నింటిలో ఆయన పూజలు చేశారో లెక్కే లేదు. ఒక్కరే చేశారు. భార్య అనే ప్రస్తావనే లేకుండా చేశారు.

ఆయన భార్య లేని వారూ కాదు, వివాహం కాని వారు కాదు.






ఆయన రాముల వారి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తుంటే... ఆ పని చేయవలసిన సర్వసంఘ పరిత్యాగులైన పీఠాదిపతులు మౌనంగా ఉంటున్నారు.

ఎందుకంటే... మూడోసారి ప్రధాని కావాల్సిందే అనే తీవ్ర పట్టుదలతో నరేంద్ర మోడీ ఉన్నారు. అందుకు రామాలయాన్ని దేశ ప్రజలకు ఎరగా వేస్తున్నారు. దేశంలోని ఇంగ్లీష్, హిందీ ఇతర మీడియాలు పోటీలుపడి ఈ రామాలయ ప్రారంభ కార్యక్రమాన్ని... ఎవరి స్థాయిలో వారు ప్రమోట్ చేస్తున్నారు.

ప్రతిపక్షాలకు ఇది ఒక రాజకీయ కార్యక్రమంగా కనిపించింది. ఇందుకు అనేక దృష్టాంతాలు సైతం కనపడుతున్నాయి. "అయోధ్య అక్షింతలు" అంటూ అక్షింతలను బీజేపీ, ఆర్‌యస్‌యస్ వారు ఇంటింటికీ తిరిగి పంచుతున్నారు. బీజేపీకి అనుకూలమైన ఇతర పార్టీల నేతలు, ఇతర ప్రముఖులకే ఆహ్వానాలు వెళుతున్నాయి. ప్రధానిని మరింతగా ఫోకస్ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓవర్ టైమ్ పని చేస్తున్నాయి.

కెమెరాల ముందు తప్ప రామునిపై భక్తి కనిపించడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



అందుకే అంటూ, కాంగ్రెస్ బాయ్‌కాట్ చేసింది. అయోధ్య కార్యక్రమంకు కౌంటర్‌గా "భారత్ న్యాయ్ యాత్ర" పేరిట తూర్పు నుంచి పడమరకు రాహుల్ గాంధీ నడక ప్రారంభించారు.

ఇం.డి.యా పేరిట ప్రతిపక్షాలు మరింత సంఘటితం అవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సర్వశక్తులూ ధారపోస్తున్నారంటూ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నట్టుగానే... కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి నరేంద్రమోడీ చాలా కృషి చేస్తున్నారనే వ్యాఖ్యానాలు కూడా వినబడుతున్నాయి. ప్రస్తుత లోక్‌సభలో 58 స్థానాలున్న కాంగ్రెస్ నరేంద్ర మోడీ దయవల్ల, వచ్చే కొత్త లోక్‌సభలో 140 స్థానాల వరకూ తెచ్చుకోగలమని ఆశపడుతోంది.

మామూలుగా అయితే కాంగ్రెస్‌కు కాంగ్రెస్సే సహజ శత్రువు. అటువంటి కాంగ్రెస్ సంఘటితం అయితే ఫలితం ఎలా ఉంటుందో కర్ణాటక, తెలంగాణలో నరేంద్ర మోడీ స్వయంగా చూశారు.

లోక్‌సభ ఫలితాల్లో కేరళ, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణపై బీజేపీకి పెద్దగా ఆశలు ఉండే అవకాశం లేదు. మహారాష్ట్రలో కూడా ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న శివసేన, కాంగ్రెస్, శరద్‌పవార్ కూటమి... బీజేపీకి చమటలు పట్టించడానికి సిద్ధం అవుతోంది. ఢిల్లీ, పంజాబ్‌లో బీజేపీకి పని జరిగే అవకాశాలు లేవు.

ఇక, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, బెంగాల్, బీహార్, అస్సాం, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనే బీజేపీని రాములవారు భుజానికి ఎత్తుకోవాల్సి ఉంటుంది.

ఆ ఆశతోనే, బీజేపీ మొత్తం సైన్యం అయోధ్యపై కేంద్రీకరించి పని చేస్తోంది. ఇదొక భావోద్వేగ అంశం. బీజేపీ రాజకీయానికి భావోద్వేగ అంశాలే ఆలంబన. అవే ఓట్లు తెచ్చిపెడతాయి కానీ, "రోటీ... కపడా... మకాన్..." కాదని బలంగా నమ్మే పార్టీ బీజేపీ. అందుకే, ఈ రామాలయ వాద, ప్రతివాదనలు.

ఈ పులుసుతో ఈ ముద్ద అన్నట్టుగా ఈ రామాలయం అంశంతో ఈ లోక్‌సభ గండం గట్టెక్కితే వచ్చే ఎన్నికల నాటికి ద్వారక శ్రీకృష్ణ దేవాలయానికి చేరుకుంటారు. రాములవారికి నైవేద్యం పెట్టడానికి కూడా బీజేపీ వారు అయోధ్యలో కనపడకపోతే ఆశ్చర్యం లేదు. అందరూ "చలో ద్వారకా" కార్యక్రమంలో ఫుల్ బిజీగా ఉంటారు.

ప్రస్తుత్తానికి, అయోధ్యలో ఇదో ఆధ్యాత్మిక కార్యక్రమం అని బీజేపీ కాదు... కాదు... ఇదో రాజకీయ కార్యక్రమం అని ప్రతిపక్షాలు... దేశ ప్రజలకు నిరూపించడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఈ రణగొణ ధ్వనులమధ్య... దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ, ఆర్థిక, సామాజిక సమస్యలు ఆలకించడానికి నరేంద్రమోడీకి తీరికలేదు. అడగడానికి ప్రతిపక్షాలకూ సమయం లేదు.

మరి ఆ శ్రీరామచంద్రుడు ఏమి చేస్తాడో!?

ఈ గోలంతా నాకెందుకులే అని, రేపు 22వ తేదీన అయోధ్య వెళ్లకుండా భద్రాచలంలోనే సెటిల్ అయిపోతే మాత్రం...!

భద్రాచలంలో శ్రీరాముడికి రాజకీయ విరాళాలతో గుడి నిర్మించలేదు. పరమ భక్తుడు శ్రీరామదాసు, తన ధన, మాన, రక్త, చమటలతో భద్రాద్రి నిర్మించాడు. అంతకంటే సీతమ్మ తల్లికి ప్రీతిపాత్రమైన ఆలయం రాములవారికి ఎక్కడ ఉంటుంది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# సవాళ్ల నడుమ షర్మిల

**రాజకీయ విశ్లేషకులు, మేధావులు, పరిశీలకులు అనుకున్నదే జరిగింది. రాజశేఖరరెడ్డి ఇంటి ఆడపడుచు ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించబడింది. జనవరి 21వ తేదీన తెలుగు రాష్ట్రాలలో తొలి మహిళా అధ్యక్షురాలిగా షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు చేపట్టబోతున్నారు. మరో జాతీయపార్టీ బీజేపీకి ఇప్పటికే దగ్గుపాటి పురందేశ్వరి అధ్యక్షురాలిగా ఉన్నారు. ఇద్దరు మహిళలు కూడా చరిత్రాత్మక ముఖ్యమంత్రుల కుమార్తెలే. తన చివరిశ్వాస వరకు కాంగ్రెస్‌పార్టీలో కొనసాగిన మహానేత రాజశేఖరరెడ్డి కుమార్తె వై.ఎస్.షర్మిల. తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో ప్రాంతీయపార్టీ ద్వారా సంచలనం సృష్టించిన నందమూరి తారక రామారావు కుమార్తె పురందేశ్వరి. ఇప్పటివరకు వీరిద్దరి లక్ష్యం వైసీపీనే. భవిష్యత్తులో బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా షర్మిల గురి మాత్రం అన్నపైనే.**



## షర్మిల రాజకీయ అరంగేట్రం :

అసలు రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని షర్మిల రాజకీయాలలోకి రావడానికి కారణం ఆమె అన్న జగనే. ఇది ఎవరూ కాదనలేని సత్యం. కాంగ్రెస్ పార్టీ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకి పంపించి నప్పుడు జగన్‌కి నైతికంగా అండగా నిలిచింది ఆయన అమ్మ విజయమ్మ, చెల్లి షర్మిలమ్మ. తాను జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ఆమె పాదయాత్ర చేపట్టారు. మూడువేల కిలోమీటర్లకుపైగా చకచకా తిరిగేశారు. నాన్నని, అన్నని మరపిస్తోందని ప్రజా మన్ననలని అందుకున్నారు. బాయ్.. బాయ్.. బాబు అంటూ సెటైర్లు వేశారు. బాబుని ఇంటికి పంపేవరకు నిద్రపోలేదు. అలాంటి షర్మిల, అన్న అధికారంలోకి రాగానే ఎందుకు దూరమయ్యారు...? అన్నపై అలిగిన షర్మిల తెలంగాణలో ఎందుకు పార్టీ పెట్టారు..? అది రాజకోట రహస్యం. ఇక్కడ ఆ ప్రస్తావన అనవసరం.

అయితే, కేసీఆర్‌పై అంత తీవ్రంగా ఎందుకు తిరుగుబాటు చేశారు..?? చివరికి ఎన్నికలలో పోటీ చేయకుండా ఎందుకు తప్పుకున్నారు...? ఇది మాత్రం బహిరంగ రహస్యం. కాంగ్రెస్, బీజేపీలకి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ పార్టీకి పోటీ ఇవ్వాలనుకున్నారు షర్మిల. అయితే, ఆమె ఊహించిన స్థాయిలో అక్కడి ప్రజలు ఆమెను ఆదరించలేదు. కానీ, తమకి తమ కుటుంబానికి తెలంగాణలో ఇంకా కొంత అభిమానం, ఆదరణ ఉందని మాత్రం ఆమె గ్రహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌కి లభిస్తున్న ఆదరణ ఆమె గుర్తించారు. ఆమెకున్న కొద్దిపాటి రాజకీయ అవగాహనతో పాటు కాంగ్రెస్‌పార్టీలో తల పండిన నేతలు, వై.ఎస్. కుటుంబ ఆప్తులు ఆమె వెనకుండి ఆమెను నడిపించారన్నది అందరికీ తెలిసిన విషయమే. చివరిలో వారే ఆమెకి మార్గనిర్దేశం చేశారు. పోటీ నుండి విరమింపచేశారు. కాంగ్రెస్‌కి మద్దత్తు పలికించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఓటుని చీలనీయకుండా చేసి పార్టీని గట్టెక్కించారు. వ్యూహాత్మకంగా షర్మిలని కాంగ్రెస్‌పార్టీలో చేర్పించి ఆమెని ఆంధ్ర అధ్యక్షురాలిగా నియమింపజేశారు. షర్మిల కాంగ్రెస్‌లోచేరే తరుణంలో అటు వై.ఎస్.రాజశేఖరరెడ్డికి, ఇటు కేవీపీ రామచంద్రరావుకి వీర విధేయుడైన గిడుగు రుద్రరాజు ప్రవర్తించిన తీరే ఎన్నో ప్రశ్నలకి సమాధానాలు ఇస్తుంది. తెలంగాణ ఎన్నికలలో చివరి మూడు నెలలలో చోటు చేసుకున్న పరిణామాలు, అనూహ్యంగా మారిన రాజకీయ సమీకరణలు, కాంగ్రెస్‌పార్టీ గెలిచిన విధానం గమనిస్తే ఖచ్చితంగా తెలంగాణలో ఆమె పాస్ అయినట్లే. ఆమె బరిలో ఉండి వుంటే అక్కడ కాంగ్రెస్ ఓట్లనే ఆమె చీల్చి ఉండేవారు. అందుకే ఆమె పోటీ చేయలేదు. ప్రత్యక్షంగా కాంగ్రెస్ గెలుపుకి, పరోక్షంగా బిఆర్ఎస్ ఓటమికి ఆమె కారకురాలయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ ఆమెకి హారతి పట్టింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ బాధ్యతలు అప్పజెప్పింది.

## తెలంగాణ తరహా పోరాటాలే ఇక్కడా చేస్తారా?

షర్మిల తన అన్నతో విభేదించినప్పటినుండి ఆమె పోకడ భిన్నంగా ఉంటోంది. తన అన్నతో పాటు వై.ఎస్. అభిమానులందరూ బద్ధశత్రువుగా భావించే వేమూరి రాధాకృష్ణకి ఇంటర్వ్యూ ఇవ్వడం కోసం ఆమె ఏబీఎన్ ఛానెల్ గడప తొక్కారు. తన అన్నకి నైతిక మద్దత్తు ఇస్తున్న పక్క రాష్ట్ర ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఆయన ఓటమికి కారకురాలయ్యారు. మరి రేపు ఆంధ్రాలో ఆమె వ్యూహం ఏమిటి? ఇక్కడ చాలా సవాళ్ళని ఆమె ఎదుర్కోవాలి. రాష్ట్ర విభజన పుణ్యమా అని ఆంధ్రలో కాంగ్రెస్ జీవచ్ఛవంలా మారింది. ఒకప్పుడు పార్టీ టిక్కట్ల కోసం క్యూ కట్టే నాయకులు, ఇప్పుడు పిలిచి టిక్కెట్టు ఇస్తామన్నా వద్దు బాబోయ్ అని పారిపోతున్నారు. ఇలాంటి తరుణంలో ఆమె పార్టీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. తెలంగాణ తరహాలో ఇక్కడ అధికార పార్టీపై ధ్వజమెత్తుతారా..? ప్రభుత్వ విధానాలపై పోరాటాలు సాగిస్తారా..?? అవసరమైతే దీక్షలు చేస్తారా.. అరెస్టు కావడానికి సిద్ధపడతారా..??? ఇవన్నీ చేయాలంటే ఆమెకి ఎక్కువ సమయం కూడా లేదు. జనవరి ఆఖరు తరువాత ఏ నిముషమైనా ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చని ఢిల్లీ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణలో షర్మిల కేవలం ఒక పార్టీ అధ్యక్షురాలు. కానీ, ఆంధ్రకి వచ్చేసరికి ఆమె ఒక మహోన్నత నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ప్రస్తుత ఆంధ్ర ముఖ్యమంత్రికి చెల్లెలు, ఆంధ్రుల ఆడపడుచు. ఇక్కడ జగన్ చుట్టూ ఉన్న వాళ్లంతా ఆమెకీ బంధువులే. ఇలాంటి ప్లస్ పాయింట్లు ఆమెకి చాలానే ఉన్నాయి. మొన్నటివరకు తెలంగాణ అన్నారు, ఇప్పుడు ఆంధ్ర అని ఎలా అంటారు? అని కొడాలి నాని లాంటివాళ్ళు ఆగం చేయకుండా ఆమె ముందే వారి నోళ్ళకి బంధం వేశారు. “కాంగ్రెస్‌పార్టీ జాతీయపార్టీ. ఆ పార్టీ అధిష్టానం తనని ఆంధ్రకి వెళ్ళమన్నా, అండమాన్‌కి వెళ్ళమన్నా వెళ్లి పని చేస్తాను” అని ప్రకటించేశారు. జనవరి 21న పార్టీపగ్గాలు చేపట్టిన తరువాత ఆమె పెట్టబోయే తొలి విలేఖరుల సమావేశం కోసం రాజకీయవర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. వై.ఎస్ వెర్సస్ వై.ఎస్‌ల మధ్య రాజకీయ పోరాటం ఎలావుండబోతోందోనన్న ఉత్సుకత ఇప్పుడు సర్వత్రా కనిపిస్తోంది!

# జై శ్రీరామ్

శ్రీరామచంద్రుడంటే సాక్షాత్తూ భగవంతుడే. దేవుడే మానవుడుగా అవతరిస్తే.. ఆయనే రాముడు. ఆ రాముడే దేవుడు. అందుకే ఆ దేవదేవుడు జన్మించిన అయోధ్య మానవాళికి ముక్తిని ప్రసాదించే క్షేత్రాల్లో అగ్రగామిగా ఉందని వేనవేల ఏళ్ళనాటి మన పురాణాలు పేర్కొంటున్నాయి. యుగాలు గడిచిపోయినా.. శ్రీరాముడుని, సీతమ్మ తల్లిని ఎవరూ మరచిపోలేదు. రాముని దివ్యచరిత్రను లోకానికి తెలియజేస్తూ వాల్మీకి మహర్షి రచించిన ‘రామాయణం’ గురించి తెలియని వారెవరు? అనేకభాషల్లోనూ ‘రామాయణం’ ఉంది. శ్రీరాముడు జన్మించిన నేల మనది..ఇంతకంటే భారతీయులకి గర్వకారణమైన విషయం ఏముంటుంది!.. అయినా, రాముని చరిత అంతా కష్టాల మయమే. రాజ్యాన్ని వీడి అడవుల పాలుకావడం, ధర్మపత్ని సీతమ్మ అపహరణకు గురవడం, హనుమంతుడు తదితరులతో కలసి రాముడు సీతమ్మను చెరపట్టిన రావణుడిపై యుద్ధం చేసి తిరిగి సీతమ్మను చేపట్టి పట్టాభిషిక్తుడు కావడం, నాటికాలంలోనే ‘రామరాజ్యం’ స్థాపించి ప్రజలకు జనరంజకమైన పాలన అందించడం దాకా..వాటి వెనకాల రాముడు పడిన కష్టాలు లెక్కలేనన్ని. ఆ తర్వాత యుగాల్లో పరిస్థితి తెలియదు కానీ, ఇటీవలి కాలంలోనూ రాముడికి కష్టాలే. రాముడు పుట్టిన అయోధ్యలో రాముడికి ఒక ఇల్లంటూ లేకపోవడం, ఉన్న ఒక్క ఆలయం అయిదు దశాబ్దాల క్రితం అనేక దౌష్ట్యాలకు గురవడం, ఆ రామమందిరం కోసం ఏళ్ళతరబడి జరిగిన సమరాల్లో లక్షలాది మంది రామభక్తులు ప్రాణాలను సైతం కోల్పోవడం.. ఇదంతా గత చరిత్ర. ఏదేమైనా, పరమపవిత్రమైన దేవభూమిగా పేరొంది విశ్వవ్యాప్తంగా ఆధ్యాత్మిక దివ్య జ్యోతులను ప్రకాశింపజేసే మన దేవాలయాల్లో అత్యంత భవ్యమైనది.. అయోధ్య రామాలయం. కాలగతిలో శతాబ్దాల తరబడి ఎన్నో ఒడిదుడుకులకు, విధ్వంసాలకు గురైనప్పటికీ, అన్ని అవరోధాలను దాటుకుని..భారతీయ వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచింది అయోధ్య రామాలయం. అందుకే అయోధ్య అన్నా, రాముడన్నా ప్రజలకు అంత భక్తి.

## అయోధ్య రామాలయం..అపూర్వం :

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రధాని మోడీ సారథ్యంలో, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నేతృత్వంలో తాజాగా నిర్మితమైన రామమందిరం నిర్మాణమే ఒక అద్భుతం. లెక్కలేనన్ని ప్రత్యేకతలకు ఇది నిలయం. ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా సర్వాంగసుందరమైన కట్టడాలు, శిల్పాలు నయనానందకరం గావిస్తాయి. నాగర్‌శైలి ఆలయ సంప్రదాయంలో గుర్జర–చాళుక్యుల శిల్పకళారీతిని పోలి ఉండేవిధంగా ఆలయాన్ని నిర్మించారు. మూడంతస్తుల్లో 392 స్తంభాలు, 44 ద్వారాలు–తలుపులతో నిర్మించిన ఈ ఆలయం పొడవు 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161అడుగులు ఉంటాయి. 732 మీటర్ల ప్రహరీ నిర్మించారు. ప్రధాన గర్భగుడిలో బాలశ్రీరాముని రూపం, తొలి అంతస్తులో శ్రీరాముని దర్బార్‌తో పాటు కనువిందుచేసే అయిదు మండపాలు ఉంటాయి. బాలరాముని విగ్రహంతోపాటు 1949లో రామజన్మస్థలంలో లభించిన అపూర్వమైన శ్రీరాముని రూపం.. అప్పట్లో చిన్న గుడారంలో ఉండేది. ఆ విరాట్‌స్వరూపం ఇప్పుడు అత్యంత ఘనమైన శ్రీరామచంద్రుని స్వరూపంగా విరాజిల్లబోతోంది. నాలుగు మూలల్లో నాలుగు మందిరాలు..సూర్యదేవుడు, భగవతీదేవి, విఘ్నేశ్వరుడు, పరమశివుని ఆలయాలతో పాటు ఉత్తరం వైపున మాతా అన్నపూర్ణ ఆలయం, దక్షిణాన హనుమాన్ దేవాలయం ఉంటాయి.



## 2500 ఏళ్ళు చెక్కు చెదరని ఆలయం

అయోధ్య రామాలయాన్ని దాదాపు 2,500 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా అద్వితీయమైన నైపుణ్యంతో నిర్మించడం, ఆలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రతి ఇటుకపై ‘శ్రీరామ’ నామం లిఖించి ఉండడం విశేషం. నేపాల్‌లోని గండకీ నదినుంచి వెలికితీసిన..సుమారు ఆరు కోట్ల ఏళ్ళనాటి అత్యంత విశిష్టమైన సాలగ్రామ శిలలతో సీతారామచంద్రుల విగ్రహాలను రూపుదిద్దడం.. అద్వితీయం. రామాలయం సముదాయంలో బంగారుపూతతో కూడిన 14 గేట్లు అమర్చడంతో ఆలయమంతా స్వర్ణకాంతులు వెదజల్లినట్లుగా ఉంటుంది. ప్రధాన ఆలయానికి సమీపంలో ‘సీతా కూపం’ పేరుతో ఉన్న పురాతనమైన బావిని కూడా పునరుద్ధరించారు. రామాయణంతో రాముని ఖ్యాతిని లోకానికి చాటిన ఆదికవి వాల్మీకి మహర్షి, ఇంకా వశిష్ట, విశ్వామిత్ర, వ్యాసమహర్షి తదితరుల ఆలయాలు కూడా నిర్మించారు. రాముని చరిత్రను తెలిపే కుడ్యచిత్రాలను గోడలపై తీర్చిదిద్దారు. రామజన్మభూమి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కరసేవకులు, శతాబ్దాల తరబడి ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రాలను సేకరించి అయోధ్యనగరంలోని గోడలపై చిత్రీకరిస్తున్నారు. యాత్రికుల కోసం దాదాపు పాతిక వేలమందికి సరిపోయే విధంగా ఏర్పాట్లు జరిగాయి. ఇప్పటికే అయోధ్య నుంచి శ్రీరామాక్షతలు దేశంలో ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం జరగడం, అది కూడా ఒక చరిత్రాత్మకమైన నిర్మాణంగా తీర్చిదిద్దడం భారతావనికే గర్వకారణం. దేశంలోని ప్రజలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆలయానికి అన్ని విధాలా తమవంతు సహకరించి, సేవలందించి తద్వారా తమ జీవితాలను ధన్యం చేసుకోవడం, అన్నిటికీ మించి రాముడికి గుడికట్టించిన నేతగా మోడీ అందరి ప్రశంసలందుకుంటున్నారు. అంతేకాదు, దేశానికి శాశ్వతమైన కీర్తిచంద్రికలు లభించేలా రామాలయాన్ని నిర్మిస్తున్న రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌వారి అకుంఠిత సేవలు ఈ సందర్భంగా వేనోళ్ళ ప్రస్తుతించదగినవి.

## 32 ఏళ్ళ నాటి ప్రతిజ్ఞ.. ఇప్పటికి నెరవేరుతోంది

దాదాపు 32 ఏళ్ళ క్రితం దేశంలో ఐక్యతా సందేశాన్ని వ్యాప్తిచేయాలనే ధ్యేయంతో బిజెపి నాటి అగ్రనేత మురళీమనోహర్ జోషి 1991లో ‘ఏక్తాయాత్ర’ పేరుతో కన్యాకుమారి నుంచి కశ్మీరం దాకా చేపట్టిన యాత్ర 1992 జనవరి 14న అయోధ్యకు చేరుకుంది. ఆ ఏక్తాయాత్రకు పర్యవేక్షకుడిగా ఉన్న నాటి బీజేపీ కార్యకర్తగా ఉన్న నేటి ప్రధాని నరేంద్రమోడీ, ‘రామమందిరం నిర్మించిన తర్వాతనే ఇక్కడికి తిరిగివస్తానంటూ’.. జై శ్రీరామ్ నినాదాల మధ్య భీషణ ప్రతిజ్ఞ చేశారు. మోడీ ప్రధాని అయ్యాక రామమందిర నిర్మాణానికి శంకుస్థాపన జరగడం, ఇప్పుడు కూడా మోడీయే 11 రోజుల దీక్ష చేపట్టి ప్రధానకర్తగా రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని కూడా నెరవేరుస్తుండడం విశేషం. దీంతో 32 ఏళ్ళనాటి ప్రతిజ్ఞ ఇప్పటికి నెరవేరుతోందన్నమాట!...

మరో విశేషమేమంటే, 2019లో అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి సుప్రీం కోర్టు అనుమతించడంతో ఆనాటి నుంచి రామమందిర నిర్మాణానికి కృషి ప్రారంభమైతే, ఆలయ నిర్మాణానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు పన్నెండున్నర కోట్ల మంది భక్తుల నుంచి సుమారు 3500 కోట్ల రూపాయల విరాళాలుగా వచ్చాయంటే రాముని పట్ల



ప్రజలకు ఉన్న భక్తి ఎంత గాఢమైనదో ఊహించుకోవచ్చు. ఇక్కడ మరో విషయం.. రామజన్మభూమి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన బీజేపీ సీనియర్ నేతలు అద్వానీ, మురళీమనోహర్‌జోషీలకు రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు అందినా, వారు కారణాంతరాల వల్ల రాలేకపోతున్నారని అంటున్నా, కురువృద్ధుడైన అద్వానీజీ వచ్చే అవకాశాలు లేకపోలేదని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సందర్భంగా ‘ఆ శ్రీరామచంద్రుడే ఆలయాన్ని మోడీ ద్వారా కట్టించుకున్నారు’ అంటూ అద్వానీ కితాబివ్వడం విశేషం.



# ఎస్మా ప్రతులు దగ్ధం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న జీఓలు అసంబద్ధంగా ఉంటున్నాయంటూ కావలిలోని టీడీపీ కార్యాలయం వద్ద ఈనెల 14న ఎస్మా జీఓ ప్రతులను దగ్ధం చేశారు. కావలిలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఆమరణ నిరాహార దీక్షా శిబిరంలో పెద్దసంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు రఘురావమ్మ, సీపీఎం నాయకుడు పసుపులేటి పెంచలయ్య, మధుసూదనరావు, తిరుపాల్, విజయలత, బిందు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న..భోగి తాటాకు



ఈసారి భోగిపండుగకు వేసుకునే తాటాకుల ధర మరీ భగ్గుమంది. గత సంవత్సరం 50 రూపాయలకి నాలుగు తాటాకులు ఇస్తే, ఈసారి వాటి ధర వంద రూపాయలు పలికింది. నాలుగు తాటాకులు వంద రూపాయలా?..అంటూ జనం ఆశ్చర్యపోయారు. కానీ చేసేదేమీ లేక వాటినే అధికశాతం ప్రజలు కొనుగోలు చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన వీధుల్లో బండ్లమీద తాటాకులు తీసుకువచ్చి భోగి ముందురోజున వాటిని విక్రయించారు. ఇళ్ళవద్దకు వచ్చి అమ్మేవారి వద్ద నుంచి కూడా ప్రజలు వంద ఇచ్చి ఆ నాలుగు తాటాకులు కొనుక్కుని భోగి మంటలు వేసుకున్నారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానందతీర్థ జన్మదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని ఇరుకళల అమ్మవారి దేవస్థానం వద్ద ఈనెల 14 పలువురు దివ్యాంగులకు, వృద్ధులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గీతా వైభవ్ ట్రస్ట్ ఛైర్మెన్ నజీర్‌బాషా, కోట సత్యం, దత్త భక్తమండలి కన్వీనర్ రుష్యేంద్రబాబు తదితరుల సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.

# చిన్నారులకు భోగిపండ్లతో దీవెనలు



నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్దనున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈనెల 14న భోగిపండుగ సందర్భంగా అనేకమంది చిన్నారులకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్దంగా భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సింహపురి సంక్రాంతి ఉత్సవసమితి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఉత్యవ సమితి నిర్వాహకులు పిట్టి సత్యనాగేశ్వరరావు, రంగరాజన్, శ్రీనివాసులు, విజయలక్ష్మి, ప్రసాద్, శరవణ, బుజ్జయ్య, సుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్, మోహన్‌రావు, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, టివిఎస్ కల్యాణ సదన్ ట్రస్టీ ఫణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికులకు

# తీపి కబురు

**- రూ.23.35 కోట్ల బకాయిల చెల్లింపుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్**



ఎట్టకేలకు బకాయిలు తీరుస్తామంటూ కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికులకు తీపి కబురు అందింది. సంక్రాంతి పర్వదినాల సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కార్మికుల బకాయిల విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని సంప్రదించగా, ఆ బకాయిలను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా సీఎం ఆదేశించారని, ఈ నెలాఖరు లోపు బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లిస్తారని జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. ఈనెల 14న ఆయన కోవూరులోని వైకాపా కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. మొత్తం 466 మందికి 22.34 కోట్ల రూపాయల బకాయిలను ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలపడంతో రైతులు, కార్మికులు, కార్మిక సంఘాల వారు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయిదేళ్ళలో ఒక్క డీఎస్సీ కూడా లేదు

**- టీడీపీ నాయకుల విమర్శ**



ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి యువతకు ఉద్యోగాలిస్తామని జగన్‌మోహన్‌రెడ్డి యువతను నమ్మించి మోసం చేశారని, వైకాపా అధికారంలోకి వచ్చిన ఈ అయిదేళ్ళలో ఒక్క డీఎస్సీ కూడా లేదని, యువత భవిత అంధకారంలో పడిపోయిందని తెలుగుదేశం నాయకులు తూర్పారబట్టారు. నెల్లూరులో ఈనెల 13న టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్, తెలుగుయువత అధ్యక్షుడు కాకార్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట వేసిన భోగిమంటల్లో జాబ్ క్యాలెండర్ హామీ పత్రాలను, జీఓల ప్రతులను వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతకాలంగా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేయకుండా వైకాపా ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న వైకాపా పాలన పోవాలని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైకాపాను ఓడించి గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ ఆందోళనలో టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య, మామిడాల మధు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, సాబిర్‌ఖాన్, పనబాక భూలక్ష్మి, వడ్డమూడి రమేష్, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు అమృల్లా, నన్నేసాహెబ్, హరికృష్ణ, శ్రీనివాసులు, జలదంకి సుధాకర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో జాతీయ యువజన దినోత్సవం



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాతీయ యువజన దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, స్వామి వివేకానంద జీవితం, ఆదర్శాలు యువతకు స్ఫూర్తిదాయకమని, దేశ ఘనకీర్తిని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద ఉన్నతాదర్శాల బాటలో విద్యార్థులు నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథ్‌రెడి, సమన్వయకర్త ఆర్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మన్సూర్ సేవలు ఆదర్శప్రాయం

దివంగత సీపీఎం నాయకుడు, నెల్లూరు నగరంలో పేదల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మన్సూర్ సేవలను స్మరించుకుంటూ ఈనెల 14న ఆయన సమాధి వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. మన్సూర్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, చంద్రారెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టూకీగా...



### వేదగిరిలో వేడుకగా.. గోదాదేవికి పూజలు

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఇటీవల గోదాదేవి కల్యాణం వేడుకగా జరిగింది. తొలుత ఎదురుకోలు ఉత్సవం, గిరిప్రదక్షిణ అనంతరం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఇఓ గిరికృష్ణ, ధర్మకర్తల మండలి వారు పర్యవేక్షించారు

### సంక్రాంతిపల్లెలో ఉత్సాహంగా సంక్రాంతి

రాపూరు మండలంలోని సంక్రాంతిపల్లె గ్రామంలో.. పేరుకు తగ్గట్టుగా గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉంటూ ఏటా సంక్రాంతి పండుగలను వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామంలోని యువత ఆధ్వర్యంలో ఉత్సాహంగా పండుగలు చేసుకున్నారు. ఆటల పోటీల్లో విజేతలకు దాత ఉప్పల వెంకటేశ్వర్లు బహుమతులందజేశారు.

### బుచ్చిలో స్వామి వివేకానంద జయంతి

బుచ్చిరెడ్డిపాళెంలోని గోపాలకృష్ణ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో ఇటీవల స్వామి వివేకానంద 161వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో పాఠశాల కరెస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, నిర్వాహకులు పి.రమణయ్య, నరసింహమూర్తి, సుధీర్, సుబ్బారావు, కౌన్సిలర్ శ్రీదేవి, రామకృష్ణమఠం సభ్యులు పాల్గొన్నారు.

### మర్రిపాడులో కోడిపందాల స్థావరాలపై దాడులు

సంగం మర్రిపాడు గ్రామం వద్ద అటవీప్రాంతాల్లో ఉన్న కోడిపందాల స్థావరాలపై పోలీసులు ఇటీవల దాడులుచేసి కోడిపందాలాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 కోళ్ళను, రూ.18,880లను కూడా స్వాధీనం చేసుకున్నారు. సంగం ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడలు చేశారు.

### మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు

మండల కేంద్రమైన మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ అమ్మవారికి బోగి పండుగ సందర్భంగా ఈనెల 14న ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సాయికుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు అభిషేకాలు ఘనంగా జరిగాయి. గూడూరు పెంచలయ్య–జ్యోతమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### పెంచలకోనలో గోదాదేవి క్షేత్రోత్సవం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో కొలువైవున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 14న గోదాదేవి అమ్మవారి క్షేత్రోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు అమ్మవారి కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు ఈ వేడుకలను తిలకించారు.

### కలిగిరిలో ఎస్సీఎస్టీలకు స్వీట్‌బాక్సులు పంపిణీ

సంక్రాంతి పండుగల సందర్భంగా ఈనెల 14న కలిగిరి పంచాయతీలోని సుమారు 6వందల ఎస్సీఎస్టీల కుటుంబాలకు గ్రామ ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి తమ చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా స్వీట్‌బాక్సులు పంపిణీచేసి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు బి.మస్తాన్‌రెడ్డి, సభ్యుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జలదంకిలో యువకుల రక్తదానం

మండలకేంద్రమైన జలదంకిలో సంక్రాంతి పండుగల సందర్భంగా ఈనెల 14న 24 మంది యువకులు రక్తదానం చేశారు. ఐ కేర్ మిషన్, జలదంకి జెమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి రెడ్‌క్రాస్ మండలశాఖ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. హజరత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

### పండగానిపల్లెలో పండుగ వేడుకలు

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఉదయగిరి మండలంలోని పండగానిపల్లెలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

# ప్రథమ వర్ధంతి



జననం
24.10.1931

నిర్యాణం
25.01.2023

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి

## శ్రీమతి పెనాక లక్ష్మీనారాయణమ్మ గారు

స్వర్గస్తురాలై తేది. 25.01.2024 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆమె దివ్యస్మృతిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు

**పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి**
వ్యవస్థాపకులు, అరబిందో ఫార్మా లిమిటెడ్
**పెనాక గోపినాథ్‌రెడ్డి**

కుమార్తెలు

**బొమ్మా సరళ**
**తోటపల్లి రమాదేవి**

మనవళ్ళు

**పెనాక శరత్‌చంద్రారెడ్డి**
**పెనాక రోహిత్‌రెడ్డి**

మరియు
**కుటుంబసభ్యులు**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com